ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తిరుపతి
జిల్లా వార్తలు
ఆదివారం 29 జూన్ 2025

డాక్టర్ నెలవల విజయశ్రీ సూళ్లూరుపేట ఎమ్మెల్యే ఏడాదిలో ఏం చేశారు?



తండ్రి రాజకీయ నేత అయినా.. ఆమె ఎంబీబీఎస్ చదివి వైద్యవృత్తిని చేపట్టారు. అనూహ్యంగా 2024లో రాజకీయ ప్రవేశం చేశారు. అనుభవం లేదు. పేట రాజకీయాలను ఈ డాక్టర్ ఎలా ఎదుర్కొని నిలదొక్కుకుంటారని అంతా పెదవి విరిచారు. అయితే తొలి అడుగులోనే ఆమె విజయ పతాకం ఎగరేశారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యేగా పదవీ బాధ్యతలు తీసుకున్నాక నెలవల విజయశ్రీ అలుపెరుగని ప్రయాణం సాగిస్తున్నారు. తిరుపతి ఎంపీగానూ, సూళ్లూరుపేట ఎమ్మెల్యేగానూ చేసిన తండ్రి నెలవల సుబ్రమణ్యం అనుభవాన్ని ఆసరా చేసుకుంటున్నారు. పల్లెపల్లే, గడపగడపా తిరుగుతూ సొంత బాటను ఏర్పరచుకుంటున్నారు. 'గుడ్ మార్నింగ్..' అంటూ సొంతంగా ఒక కార్యక్రమాన్ని రూపొందించుకుని తెల్లవారకముందే పల్లెబాట పడుతున్నారు. ప్రజల్లో నిరంతరం ఉంటూ సమస్యలు తెలుసుకుంటున్నారు. ఇందుకోసం తన నివాసాన్ని సూళ్లూరుపేటకు మార్చుకున్నారు. ప్రజలకు ఏం చేయాలో ప్రజల నుంచే నేర్చుకుంటూ నెలవల విజయశ్రీ తొలి ఏడాది ప్రయాణం సాగింది. ఈ ఏడాదిలో ఆమె సూళ్లూరుపేట నియోజకవర్గానికి ఏం చేశారు? ఏం చేస్తామని ఎన్నికల్లో చెప్పారు? ఇంకా ఆమె ముందున్న సవాళ్లు ఏమిటి? సూళ్లూరుపేట ప్రజలు తమ ఎమ్మెల్యే నుంచి ఏం ఆశిస్తున్నారు...? వీటి సమాహారమే ఇది...

- 8వ పేజీలో -

ఈనెలా కందిపప్పు లేనట్లే!

రేషన్ కార్డుదారులకు తప్పని నిరాశ

తిరుపతి(నేరవిభాగం), జూన్ 28(ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుదారులకు కందిపప్పు దూరమవుతోంది. అవసరమైన మేరకు సరఫరా లేకపోవడంతో ఈ ఏడాది మార్చి నుంచి కందిపప్పు సరఫరా నిలిపేశారు. జూలై నెలలోనూ బియ్యం, చక్కెరతో సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. కాగా, జూలైలో బియ్యం, చక్కెరతో పాటు కందిపప్పు, రాగులు, ఇస్తామని ప్రభుత్వం ప్రకటించినా ఆచరణకు నోచుకోవడం లేదు. దీనిపై పౌరసరఫరాల శాఖ అధికారి శేషాచలం రాజును వివరణ కోరగా అవసరమైన మేరకు సరుకు లేకపోవడంతో ఇవ్వలేకపోతున్నామని చెప్పారు. గత వైసీపీ ప్రభుత్వం అనుసరించిన విధానాల వల్ల పౌరసరఫరాల వ్యవస్థ చిన్నాభిన్నమైంది. దాన్ని సరిచేయడం ప్రస్తుత పాలకులకు సవాలుగా మారింది.

101 ఒప్పందాలు

● కొనుగోలు, అమ్మకందారుల సమావేశాలు విజయవంతం



ఎంఓయూలు చేసుకుంటున్న కొనుగోలు, అమ్మకందారులు

తిరుచానూరు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో జరిగిన కొనుగోలు, అమ్మకందారుల సమావేశాలు విజయవంతమయ్యాయని ఏపీ ఎంఎస్ఎంఈడీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుదర్శన్‌బాబు, ఎఫ్ఐఈఓ జాయింట్ డైరెక్టర్ ఉన్నికృష్ణన్ తెలిపారు. మొత్తం 101 ఎంఓయూలు కుదిరినట్లు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీ ఎంఎస్ఎంఈడీసీ), భారత ఎగుమతి సంస్థల సమాఖ్య (ఎఫ్ఐఈఓ) ఆధ్వర్యంలో తాజ్‌హోటల్ వేదికగా మూడు రోజులపాటు జరిగిన కొనుగోలు, అమ్మకందారుల సమావేశాలు శనివారంతో ముగిశాయి. వారు మాట్లాడుతూ 40 మంది ఎగుమతిదారులు, 38 మంది మహిళా వ్యవస్థాపకులతో 101 ఎంఓయూలు కుదిరినట్టు వివరించారు. ఈ అవగాహనా ఒప్పందాలు ఎంఎస్ఎంఈలు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్‌పీఓ), చేతివృత్తులవారు, నేత సంఘాలకు అంతర్జాతీయ వాణిజ్య అవకాశాలను మరింతంగా పెంపొందిస్తుందని వివరించారు.



డంపింగ్ యార్డులోని లెగసీ వ్యర్థాలు - గుట్టలుగా కనిపిస్తున్న తడి వ్యర్థాలు

తొలగని చెత్త తలనొప్పి

● డంపింగ్ యార్డులో పెరుగుతున్న వ్యర్థాలు
● కాలపరిమితి ముగియడంతో వెనుదిరిగిన కాంట్రాక్టర్లు
● ఫలించని టీటీడీ 'ఉచిత' నిర్వహణయత్నం

తిరుమల, జూన్28(ఆంధ్రజ్యోతి): తిరుమల కొండపై చెత్త సమస్య సమసిపోలేదు. మళ్లీ వ్యర్థాలు గుట్టల్లా పోగవుతున్నాయి. కొండలా పేరుకుపోతున్న ఇక్కడి చెత్త తొలగింపుపై గతేడాది టీడీపీ ప్రత్యేక దృష్టి సారించింది. కొండ మీద రోజూ తడిచెత్త దాదాపు 30 టన్నులు, పొడిచెత్త 40 టన్నుల వరకు సేకరించి గోగర్భం డ్యాం సమీపంలోని కాకులమాను దిబ్బ వద్ద డంప్‌యార్డ్‌కు తరలిస్తున్నారు. అక్కడ తడిచెత్తను ప్రాసెస్ చేశాక కంపోస్టు తయారు చేసి మిగిలిన వ్యర్థాలను సిమెంట్ ఫ్యాక్టరీ లేదా పవర్‌ప్రాజెక్ట్‌ల ప్రాంతాలకు పంపాలి. కానీ ఐదారేళ్లుగా ఈ ప్రక్రియ సరైన రీతిలో జరగలేదు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించి తడి, పొడిచెత్తలను వేరు చేసి తరలించడంలోనే విఫలమాయ్యారు. దీంతో కంపోస్టు కేంద్రంలో నిర్వహణ సరిగా జరగలేదు. ఫలితంగా కొండలను తలపించేలా వ్యర్థాలు చేరిపోయాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక గతేడాది నవంబరులో ఈ సమస్య పరిష్కరించాలని సంకల్పించింది. అప్పటికే దాదాపు నాలున్నర లక్షల మెట్రిక్ టన్నుల వ్యర్థాలున్నట్టు గుర్తించారు. ఆరు నెలల్లోపు క్లియర్ చేస్తామని ప్రకటించారు.

వెనుదిరిగిన కాంట్రాక్టు సంస్థలు

కొన్ని నెలల పాటు ఓ సంస్థ దాదాపు 1.80 లక్షల మెట్రిక్ టన్నుల లెగసీ వ్యర్థాలను ప్రాసెస్ చేసి తొలగించింది. సవ్యంగా జరుగుతోందనుకునే లోపే సంస్థ కాంట్రాక్టు పూర్తయింది. కాంట్రాక్టును పొడిగించాలని ఆ సంస్థ కోరింది. టీటీడీ అంగీకరించలేదు. ఉచితంగా చేయాలని కోరింది. దీంతో ఆ సంస్థ వెళ్లిపోయినట్టు సమాచారం. తడిచెత్తను ప్రాసెస్ చేసే సంస్థ కాంట్రాక్టు కూడా ఈ ఏడాది మార్చికే పూర్తయింది. యంత్రాల మరమ్మతులు, కార్మిక సమస్యతో సరిగా నిర్వహించలేదంటూ ఆ సంస్థకు కూడా అనుమతికి నిరాకరించింది. పొడి వ్యర్థాల నిర్వహణకు సంబంధించిన మరో సంస్థకు ఎనిమిదేళ్ల పాటు అగ్రిమెంట్ ఉంది. ఈ సంస్థ కూడా సమర్థమంతంగా నిర్వహించడం లేదని టీటీడీ భావించింది. యంత్రాలతో చేయాలనే నిబంధన లేకపోవడంతో మాన్యువల్‌గానే ప్రాసెస్ చేస్తున్న క్రమంలో పొడిచెత్త ఎంతకూ తరగడం లేదు. దీంతో డంపింగ్ యార్డులో లెగసీ వ్యర్థాలు 50 వేల మెట్రిక్ టన్నులు, తడి వ్యర్థాలు 31,500 మెట్రిక్ టన్నులు, పొడి వ్యర్థాలు 4,800 మెట్రిక్ టన్నులు పేరుకుపోయాయి. తిరుమల పర్యావరణానికే ఈ వ్యర్థాల ద్వారా నష్టం వాటిల్లే అవకాశముందనే భయంతో టీటీడీ ఇటీవల రాజే ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్స్ సంస్థను సలహాదారుగా నియమించింది. ఈ సంస్థ పలు సూచనలు చేసింది. వీలైనంత త్వరగా ఓపెన్ టెండర్లను పిలిచి తొలగించాలని, లేకుంటే ఇబ్బందులు తలెత్తే అవకాశాలున్నాయని పేర్కొంది. ఉచితం కోసం ఎదురు చూడాలా, సమర్థ సంస్థలకు టెండర్లు ఖరారు చేయాలా అని టీటీడీ తర్జనభర్జనలు పడుతున్నట్లు తెలిసింది.



పరిమితి మించితే చర్యలు

స్కూలు బస్సులు, ఆటోలకు ఎస్పీ హెచ్చరిక

తిరుపతి(నేరవిభాగం), జూన్ 28(ఆంధ్రజ్యోతి): విద్యా సంస్థల బస్సులు, ఆటోల్లో పరిమితికి మించి విద్యార్థులను తీసుకెళితే చర్యలు తప్పవని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు హెచ్చరించారు. వాహనాలకు సంబంధించి అన్ని ధ్రువీకరణ పత్రాలు ఉండాలని తెలిపారు. డ్రైవర్లకు లైసెన్స్ లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. వేగం నియంత్రణలో ఉండాలని తెలిపారు. ప్రతిరోజూ డ్రైవర్లు బస్సులు తీసుకునే సమయంలో యాజమాన్యం అన్నీ పరిశీలించి అనుమతించాలని కోరారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఏర్పేడు హౌసింగ్‌లో స్టీల్ గోల్‌మాల్

● రూ.34 లక్షల విలువైన 44 టన్నులు మాయం

ఏర్పేడు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఏర్పేడు హౌసింగ్ డిపార్ట్‌మెంట్‌లో భారీ కుంభకోణం వెలుగుచూసింది. 34 లక్షల రూపాయల విలువైన స్టీల్‌ను వైసీపీ హయాంలో అధికారులు స్వాహా చేశారు. ఇందులో ఎవరి పాత్ర ఏమిటో విచారణలో నిగ్గు తేల్చాల్సి ఉంది. గత వైసీపీ పాలనలో అవుట్ సోర్సింగ్ కింద హౌసింగ్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న అమర్నాథ్‌ను మండల హౌసింగ్ ఏఈగా నియమించారు. ఆయన 2023 ఫిబ్రవరి నుంచి 2025 మార్చి 14వ తేదీ వరకు మండలంలో పనిచేశారు. చివర సంవత్సరంలో వంద టన్నుల స్టీల్ కావాలని జిల్లా అధికారులకు ప్రతిపాదనలు పంపారు. ఆ మేరకు గోడౌన్ నుంచి స్టీలు మండలానికి తెప్పించుకున్నాడు. అందులో 56 టన్నులను మాత్రమే హౌసింగ్ లబ్ధిదారులకు పంపిణీ చేశాడు. మిగిలిన 44 టన్నులను స్వాహా చేశారు. దాని విలువ 34 లక్షల రూపాయలుగా ఉంది. ఇది అప్పటి ప్రజాప్రతినిధుల అండదండలతో వారి కనుసన్నల్లోనే జరిగినట్లు తెలుస్తోంది.

● వెలుగులోకి వచ్చిందిలా..

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వైసీపీ పాలనలో జరిగిన ఇళ్ల నిర్మాణాలపై ఆరా తీశారు. రికార్డులను తనిఖీ చేశారు. 44 టన్నుల స్టీలు గోల్‌మాల్ జరిగినట్లు తేలింది. కాగా, ఏ అధికారులైతే అవినీతి జరిగినట్లు గుర్తించారో వారే దాన్ని కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు దృష్టి సారించి దీనికి వెనుక ఎవరు ఉన్నారనేది నిగ్గు తేల్చాల్సి ఉంది. కాగా, మండల స్థాయి నాయకులు హౌసింగ్ అధికారులను ప్రలోభాలకు గురిచేసి స్టీల్‌ను తమ ఇళ్లకు తరలించుకున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. దీనిపై విచారణ చేపట్టిన హౌసింగ్ డీఈ త్వరలో పోలీసులకు ఫిర్యాదు చేసే అవకాశముంది.

ముగిసిన వార్డు కార్యదర్శుల బదిలీ కౌన్సెలింగ్

చిత్తూరు అర్బన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని వార్డు కార్యదర్శుల బదిలీ కౌన్సెలింగ్ ప్రశాంతంగా ముగిసింది. శనివారం స్థానిక నాగయ్య కళాక్షేత్రంలో నిర్వహించిన కౌన్సెలింగ్ ప్రక్రియను కమిషనర్ నరసింహప్రసాద్ పర్యవేక్షించారు. చిత్తూరు, తిరుపతి నగరపాలక సంస్థలు, మదనపల్లె, కుప్పం, పుంగనూరు, పలమనేరు, పుత్తూరు, నగరి, శ్రీకాళహస్తి పురపాలక సంఘాల పరిధిలో ఐదేళ్లు పూర్తి చేసుకుని వారికి బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. వార్డు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్, ఎడ్యుకేషన్ అండ్ ఎన్విరాన్మెంటల్, వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంట్ కార్యదర్శులకు కౌన్సెలింగ్ నిర్వహించి, వారినుంచి ఆప్షన్ ఫామ్స్ తీసుకున్నారు. రెండో రోజు జరిగిన కౌన్సెలింగ్‌కు వార్డు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్యదర్శులు 184 మంది, ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ కార్యదర్శులు 192 మంది, వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంట్ కార్యదర్శులు 143 మంది, రిక్వెస్టు బదిలీల కోసం దరఖాస్తులు చేసుకున్న 38 మంది హాజరయ్యారు.



బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు, హాజరైన సచివాలయ ఉద్యోగులు

దోబూచులాడుతున్న రుతుపవనాలు

పుత్తూరు టౌన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఇదిగో రుతుపవనాలు.. అదిగో వర్షాలంటూ వాతావరణ శాఖాధికారుల ప్రకటనలను నమ్మిన రైతన్నలకు నిరాశే మిగులుతోంది. సాధారణంగా ఖరీఫ్ సీజన్ జూన్ మొదటి నెలలోనే ప్రారంభం అవుతుంది. రైతులు మే నెలలో కురిసిన తొలకరి వర్షాలతో సాగుకు సిద్ధం చేసుకున్నారు. ఈ ఏడాది జూన్ పూర్తవుతున్నప్పటికీ వర్షాలు కురవకపోవడంతో రైతన్నలు నిరాశ నిస్పృహలకు లోనవుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో సాధారణంగా తూర్పు మండలాల్లో సాధారణం కంటే తక్కువే కురిసింది. దీనికితోడు వాతావరణ శాఖాధికారులు చేసిన ప్రకటనలతో రైతన్నలు సంతోషపడినప్పటికీ రుణపవనాలు కానరాకపోవడంతో దుక్కులు దున్ని ఆకాశం వైపు వర్షం కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. ఈ సీజన్‌లో సాధారణంగా వరి, వేరుశనగ, సజ్జలు అధిక మొత్తంలో పండిస్తారు. బోర్లు, బావులు ఉన్నప్పటికీ ఖరీఫ్ సాగుకు కావాల్సినంత నీరు వర్షం ద్వారానే సాధ్యమవుతుంది. ఆ మేరకు వర్షాలు పడకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

బంగారు తిరుచ్చిపై కల్యాణ వెంకన్న అభయం



చంద్రగిరి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి శనివారం బంగారు తిరుచ్చి వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నిత్యకట్ల కైంకర్యాలు నిర్వహించాక 10.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవర్లకు ఆగమ శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం కన్నులపండువగా ఊంజల్ సేవ నిర్వహించారు. అనంతరం ఉత్సవర్లను విశేషంగా అలంకరించి బంగారు తిరుచ్చి వాహనంపై ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమాలలో ఆలయ ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు వెంకటస్వామి, మునిచెంగల్రాయులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు కిరణ్‌కుమార్‌రెడ్డి, ధనశేఖర్, అర్చకులు బాలాజిరంగాచార్యులు, శేషాద్రిచార్యులు, నారాయణాచార్యులు, పార్థసారధి, జమేదర్ చిరంజీవి పాల్గొన్నారు.

మహిళా సర్పంచ్‌లకు ముగిసిన శిక్షణ



మాట్లాడుతున్న పాకాల ఇన్‌చార్జి ఎంపీడీవో శశిరేఖ

తిరుపతి రూరల్, జూన్28(ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో డివిజన్‌స్థాయిలో మహిళా సర్పంచ్లకి మూడు జులపాటు నిర్వహించిన శిక్షణా కార్యక్రమం శనివారం ముగిసింది. వడమాలపేట, ఆర్సీపురం, ఎర్రావారిపాళెం, చిన్నగొట్టిగల్లు, పాకాల మండలాల సర్పంచ్‌లు హాజరయ్యారు. ముఖ్యఅతిథిగా హాజరైన పాకాల ఇన్‌చార్జి ఎంపీడీవో శశిరేఖ మాట్లాడుతూ..గ్రామాల్లో పారిశుద్ధ్యం, లైట్లు, నీరుకి ప్రాధాన్యత ఇవ్వాలని, తడి, పొడిచెత్త నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించి చెత్తరహిత పంచాయతీలుగా తీర్చిదిద్దడంలో అధికారులతో సర్పంచ్‌లు కలసి పనిచేయాలని సూచించారు. గార్బేజ్‌ని పొడిచెత్త యూనిట్ ద్వారా పంచాయతీలలోనే ప్రాసెస్ చేయాలని ప్రభుత్వం యోస్తోందన్నారు. ట్రైనర్, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

యూడీఎస్ పనుల్లో కదలిక



శ్మశానవాటికలో ఎక్స్‌వేటర్‌తో చేపట్టిన కాలువ పనులు

తిరుపతి రూరల్, జూన్28(ఆంధ్రజ్యోతి): తుమ్మలగుంటగ్రామపంచాయతీ నుంచి గాంధీపురం శ్మశాన వాటిక, గ్రామంలోకి చేరుతున్న మురుగునీటిని పద్మావతివర్సిటీ కూడలిలోని నగరపాలకసంస్థ యూడీఎస్‌లో కలిపే పనులను చేపడుతున్నారు. ఈక్రమంలో తుమ్మలగుంట సర్కిల్‌లోని వీఐపీ మార్గం నుంచి గాంధీపురం శశాన వాటిక లోపలమార్గంగుండా ఎక్స్‌వేటర్‌తో కాలువతీత పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే పులివర్తి నానీ చొరవతో తుమ్మలగుంటలో యూడీఎస్‌కు రూ.9.60కోట్లు మంజూరు చేయించారు. ఈనేపథ్యంలో తాజాగా పనుల్లో కదలిక వచ్చింది. శ్మశానవాటికలో మురుగునీటిని పద్మావతివర్సిటీ సర్కిల్‌లోని యూడీఎస్‌లో కలిపేందుకు చర్యలు మొదలయ్యాయి.

హిందూ టీచర్ల పట్ల వివక్ష తగదు

తిరుపతి(గాంధీరోడ్డు), జూన్28(ఆంధ్రజ్యోతి): ఐచ్ఛిక సెలవుల విషయంలో హిందూ టీచర్ల పట్ల విద్యాశాఖ ఉన్నతాధికారులు వివక్ష చూపుతున్నారని హిందూ ఉపాధ్యాయ సమితి జాతీయ అధ్యక్షుడు మహేష్‌డేగల ఒక ప్రకటనలో ఆరోపించారు. పూరిజగన్నాథ రథయాత్రని పురస్కరించుకుని ఈనెల27న కేటాయించిన ఐచ్ఛిక సెలవును ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌పేరిట ఉపయోగించుకునే వీలులేకుండా చేశారన్నారు. జూలై5న మెగాపేరెంట్ టీచర్స్ మీటింగ్‌ని నిర్వహిస్తున్నట్లు ముందస్తుగా ప్రకటించిన అధికారులు ముస్లింల పండుగ ఉండడంతో తేదీల్లో మార్పు చేశారన్నారు. హిందువుల పండుగల విషయంలో మాత్రం వివక్ష చూపుతున్నారని విమర్శించారు.

కౌటిల్య విద్యార్థులకు ఐఐఎం అడ్మిషన్లు



ఐఐఎంలలో అడ్మిషన్లు పొందిన కౌటిల్య విద్యార్థులు

తిరుపతి రూరల్, జూన్28(ఆంధ్రజ్యోతి): ఎంఆర్‌పల్లెసర్కిల్‌లోని కౌటిల్య ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ పొందిన పలువురు విద్యార్థులు ప్రతిష్ఠాత్మక ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం) విద్యాసంస్థల్లో ఎంబీఏ అడ్మిషన్లు పొందారని డైరెక్టర్ శ్రీధర్ పేర్కొన్నారు. జి.వెంకటసతీష్(ఐఐఎం, రాంచీ), కె.హరికరాజు, కె.కార్తీక్ (ఐఐఎం, సిరమౌర్), భవ్యశ్రీనిశిత(ఐఐఎం నాగపూర్),జి.అభినయ్ సుప్రీత్, పీఎస్ సుదర్శన్(సింబయాసిస్, పూణే)లో ప్రవేశాలు సాధించారన్నారు. మరో10మంది విద్యార్థులకిపైగా టాప్ బిజినెస్‌స్కూల్స్‌లో ప్రవేశాలు పొందారన్నారు. క్యాట్, ఐఐఎం అడ్మిషన్లకి సంబంధించి తమ సంస్థలో ఉచిత గైడెన్స్ కోసం సంప్రదించవచ్చన్నారు. సీటు పొందిన విద్యార్థులను, అధ్యాపకులు ఎన్.హరి, ఎన్ఎస్‌రెడ్డి అభినందించారు.

మూడు గడ్డివాముల దగ్ధం

బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్.అనంతపురం గ్రామంలో ప్రమాదవశాత్తు మూడు గడ్డివాములు దగ్ధమయ్యాయి. బాధితుల కథనం మేరకు వివరాలు.. గ్రామానికిచెందిన శారదమ్మ, మంజుల, ఈశ్వరయ్యలు చెరువుకట్ట దగ్గర 600 గడ్డి మోపులను వేసి ఉన్నారు. శనివారం మధ్యాహ్నం గడ్డివాముల నుంచి మంటలు రావడంతో పరుగునవెళ్లి అదుపు చేయడానికి ప్రయత్నం చేయగా, అదుపు కాలేదన్నారు. శ్రీకాళహస్తి ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వగా మంటలు అదుపు చేసేటప్పుడు నీరు అయిపోవడంతో షుగర్ ఫ్యాక్టరీ దగ్గర నీరు పట్టుకొచ్చే సమయానికి గడ్డి వాములు పూర్తిగా కాలిపోయినట్లు బాధితులు తెలిపారు. సుమారు రూ.5 లక్షల మేర నష్టం జరిగినట్లు బాధితులు చెప్పారు. ప్రభుత్వం తమను ఆర్థికంగా ఆదుకోవాలని వారు కోరారు.

కళావిహీనంగా ఆదిశేషు గెస్ట్‌హౌస్



13 ఏళ్లకు పాతబడిన బసగృహం- గెస్ట్‌హౌస్‌లోని గది ఇలా

తిరుమల, జూన్26(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని ఆదిశేషు గెస్ట్‌హౌస్ దారుణంగా తయారైంది. ఊడుతున్న పెయింట్ పెచ్చులు, వర్షపునీరు దిగిపోయి మరకలంటిన గోడలు, పైకప్పుతో కళాహీనంగా మారింది. సరైన వసతులు లేకపోగా తీవ్రమైన దుర్వాసన వస్తోందని భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. 2012 అక్టోబరులోమూడు అంతస్తుల్లో 42 గదులతో ఈ గెస్ట్‌హౌస్‌ను నిర్మించారు. భవన నిర్మాణం జరిగి పుష్కరకాలం దాటిన క్రమంలో భవనంలో చాలాచోట్ల పగుళ్లు ఏర్పడ్డాయి. పెయింట్ పూర్తిగా తొలగిపోయింది. వర్షపు నీరు దిగడంతో గోడలు మరకబారిపోయాయి. అక్కడక్కడ పాచి కూడా కనిపిస్తోంది. రూ.1,700 వంతున అద్దె వసూలు చేస్తున్న ఈ గదులను ఆన్‌లైన్‌లో భక్తులకు కేటాయిస్తున్నారు. పొందిన భక్తులు అందులోకి వెళ్లాక తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బస చేయలేక ఇబ్బంది పడుతున్నారు. కాగా, ఇప్పటికే దీని మరమ్మతుల కోసం మూడుసార్లు టీటీడీ టెండర్లకు వెళ్లి రద్దు చేసినట్టు తెలిసింది

చైర్మన్‌ను కలిసిన ఆగమ సలహా మండలి



చైర్మన్‌ను ఆశీర్వదిస్తున్న వేదపండితులు

తిరుమల, జూన్28(ఆంధ్రజ్యోతి): టీటీడీకి కొత్తగా ఎంపికైన ఆగమ సలహామండలి సభ్యులు బోర్డు చైర్మన్‌ను బీఆర్ నాయుడిని మర్యాదపూర్వకంగా కలిశారు. సభ్యులు ఖాద్రి నరసింహాచార్యులు, అనంతశయన దీక్షితులు, భావనారాయణ చార్యులు, వరదభట్టర్ శనివారం రాత్రి తిరుమలలోని క్యాంపు కార్యాలయానికి వెళ్లి చైర్మన్‌ను కలిసి పట్టువస్త్రాన్ని కప్పి ఆశీర్వచనం చేశారు.

●వారాహీ నవరాత్రి ఉత్సవాలకు రావాలంటూ టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడిం‌ర రాయలచెరువు శ్రీశక్తిపీఠం అర్చకులు ఆహ్వానించారు. జూలై 4 వరకు జరిగే వేడుకలకు తప్పకుండా హాజరుకావాలని ఆహ్వానపత్రం అందజేశారు. అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు.

గాయపడిన వ్యక్తి మృతి



మృతి చెందిన చిట్టిబాబు

తిరుపతి(రామచంద్రాపురం), జూన్ 28(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలంలోని గరుడాద్రి హౌసింగ్ కాలనీ సమీపంలో జాతీయరహదారిలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. పరమాల దళితవాడకు చెందిన మృతుడు చిట్టిబాబు(39)కు ఇద్దరు పిల్లలు, భార్య ఉన్నారు. అతని మృతదేహానికి పలువురు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

అమ్మవారిని దర్శించుకున్న సీసీఎల్ఏ జయలక్ష్మి



తిరుచానూరు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులోని పద్మావతి అమ్మవారిని శనివారం ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ (సీసీఎల్ఏ)జయలక్ష్మి దర్శించుకున్నారు. అనంతరం ఆమెకు ఆలయ అధికారులు అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆమె వెంట రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.


యువతి ఆత్మహత్య



మృతిచెందిన మహేశ్వరి

చిల్లకూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైటాసత్రం గిరిజన కాలనీలో ఓ యువతి శనివారం ఉరివేసు కుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల వివరాల మేరకు... మండలంలోని రైటాసత్రం గిరిజన కాలనీకి చెందిన మహేశ్వరి(18) గూడూరులోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదివి ప్రస్తుతం ఇంటి వద్దే ఉంటోంది. యువతి తల్లి మృతి చెందింది. తండ్రి శివ ప్రసాద్ కూలి పనులు చేసి కుటుంబాన్ని పోషిస్తుంటాడు. శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో మహేశ్వరి ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి



సాయినరేంద్ర (ఫైల్‌ఫొటో)

చిల్లకూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలం లోని కడివేడు సమీపంలో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు... మండలంలోని కమ్మవారిపాళెం గ్రామానికి చెందిన సాయినరేంద్ర(31) గూడూరులోని ఎస్‌బీఐలో రికవరీ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం పనులు ముగించుకుని ద్విచక్ర వాహనంలో గ్రామానికి వెళుతుండగా కడివేడు సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న కారు ఇద్దరికి గాయాలు

పెళ్లకూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళాయిపాడు వద్ద జాతీయ రహదారి నుంచి సర్వీస్ రోడ్డులోకి వెళ్తున్న ఆర్టీసీ బస్సును కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో దువ్వూరు శ్రావణ్ కుమార్ రెడ్డి, రవీంద్రారెడ్డికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా శ్రీవారి గ్రామోత్సవం



వడమాలపేట, జూన్ 28(ఆంధ్రజ్యోతి): అప్పలాయగుంటలోని ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం శ్రీవారి గ్రామోత్సవం, ఊంజల్‌సేవ వైభవంగా నిర్వహించారు. వేకువ జామున సుప్రభాతసేవతో స్వామి వారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉభయ నాంచారులతో ప్రసన్న వెంకటేశ్వర స్వామిని సర్వాభరణాలు, పూలమాలలతో ఊయలలో అలంకరించి వేదమంత్రాలు, భక్తుల గోవింద నామ స్మరణల నడుమ ఊంజల్‌సేవ నిర్వహించారు. అనంతరం సర్వాలంకార భూషితుడైన పద్మావతీ ఆండాల్ సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామిని మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ మాడ వీధుల్లో ఊరేగించారు. భక్తులు నారికేళ, కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకొన్నారు. అనంతరం ఆలయానికి చేరుకొన్న స్వామివారికి మంగళహారతులిచ్చారు. కార్యక్రమంలో ఆలయ అధికారి శివకుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యతకు అగ్రాసనం

●ఈ క్రమంలోనే తరగతుల విలీన ప్రక్రియ ●అవసరమైన చోట రవాణాభత్యం చెల్లింపు



కొత్తూరు ప్రాథమిక పాఠశాల

తిరుపతి రూరల్, జూన్28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య, బోధనలో నాణ్యత పెంపు దిశగా రాష్ట్రప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఈక్రమంలోనే కొన్ని చోట్ల తరగతుల విలీనానికి శ్రీకారం చుట్టింది. రూరల్ మండలంలో గతవిద్యాసంవత్సరంలో మాదిరిగానే ఏడాది కూడా 46 ప్రాథమిక పాఠశాలలు నడుస్తున్నాయి. వీటినే 19 మోడల్ ప్రైమరీ, 15బేసిక్ ప్రైమరీ (బీపీఎస్), 12ఫౌండేషన్ పాఠశాలలుగా విభజించింది. ఎక్కడా పాఠశాలలను మూసివేయబోమని స్పష్టం చేస్తోంది. మండలంలో ఇప్పటివరకూ 229మంది ఒకటవ తరగతిలో ప్రవేశాలు పొందారని సమాచారం.

విలీనమిలా..

బొత్తిగా విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న 12బేసిక్ పాఠశాలలు, ఎంపీయూపీ పాఠశాలలోని తరగతులను సమీపంలోని మోడల్ ప్రైమరీ, హైస్కూల్‌లోకి విలీనం చేశారని తెలిసింది. తిరుచానూరు ఈస్ట్ పాఠశాలలో 3,4,5తరగతులను వెస్ట్ మోడల్ పాఠశాలలోకి, కాలూరు, కాలూరు హరిజనవాడ, ఎస్వీ నగర్, పెరుమాళ్లపల్లెలో 3,4,5 తరగతులను సి.మల్లమరానికి , గాంధీపురం, పుదిపట్లను చెర్లోపల్లె ఎంపీఎస్‌కి, పాతూరులో 3,4,5తరగతులు బ్రాహ్మణపట్టుకు, రామానుజపల్లెలో 3,4,5తరగతులను గొల్లపల్లెకు, కుంట్రపాకం పంచాయతీలో నాగూర్ కాలనీలోని 3,4,5తరగతులను వెంకటాపురానికి మార్చారు. పాత కాల్వ యూపీస్కూల్‌లోని 6,7,8తరగతులను చెర్లోపల్లె హైస్కూల్‌లో విలీనం చేశారు. పాత కాల్వ ప్రాథమికోన్నత పాఠశాలలో 6,7,8తరగతులు విద్యార్థులసంఖ్య జీరోకి చేరినట్లు సమాచారం. విద్యార్థులసంఖ్య తగుతున్న కారణంగానే మోడల్ ప్రైమరీ పాఠశాలలో విలీనానికి ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టారని భోగట్టా. గాంధీపురం,కాలూరు,నాగూరుకాలనీల ప్రాథమిక స్కూళ్లలో 1,2 తరగతుల్లో విద్యార్థుల సంఖ్య లేకున్నా కొనసాగించనున్నారు. పాఠశాలలో చేరేలా ప్రత్యేకంగా ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్ ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కాగా తమపిల్లలను విలీన పాఠశాలలకు పంపేందుకు కొందరు తల్లిదండ్రులు ఆసక్తిచూపడంలేదని తెలిసింది.

ఏ ఒక్కటీ మూతపడలేదు



మండలంలో ఏఒక్క పాఠశాల మూతపడలేదు. 3,4,5తరగతుల్లో విద్యార్థులసంఖ్య తక్కువగా ఉన్న చోట నాణ్యమైన విద్యని అందించేందుకు మోడల్ ప్రైమరీలో విలీనం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. 1,2 తరగతులున్న ఫౌండేషన్ స్కూల్స్ కొనసాగుతాయి. దూరం అనుకున్న చోట ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్‌ని కూడా ప్రభుత్వం కల్పిస్తుంది.

మహమ్మద్ రఫీ,ఎంఈవో-1

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

● సీపీఎం జిల్లా కార్యదర్శి



మాట్లాడుతున్న నాగరాజు

తిరుపతి(ఆటోనగర్), జూన్28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజల సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి నాగరాజు విమర్శించారు. స్థానిక యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో 1.10 లక్షల ఎకరాల్లో మామిడి సాగులో ఉందన్నారు. ఏటా 5లక్షల టన్నులు పంట దిగుబడి వస్తోందన్నారు. అధికారులు ప్రకటించిన ధరలకు జూస్ ఫ్యాక్టరీల యజమానులు కొనడంలేదని పేర్కొన్నారు. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే శ్రీవారి మెట్టు చిరు వ్యాపారులు తమ సమస్యలు పరిష్క రించాలని 320 రోజులుగా పోరాటం చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. స్విమ్స్ కార్మికులు పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం చోద్యం చూస్తోందని మండిపడ్డారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

24 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ఒకరి అరెస్ట్, కారు స్వాధీనం



స్మగ్లర్ల అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

తిరుపతి, మంగళం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): రంగంపేట- శ్రీనివాస మంగాపురం మార్గంలో శనివారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీలు నిర్వహించి, 24 ఎర్రచందనం దుంగలతో పాటు, ఓ కారును స్వాధీనం చేసుకున్నారు. ఒక స్మగ్లర్‌ను అరెస్టు చేశారు. ఆర్ఐ సాయి గిరిధర్‌కు చెందిన ఆర్ఎస్ఐ లింగాధర్ టీమ్ శనివారం తెల్లవారుజామున రంగంపేట- శ్రీనివాస మంగాపురం మార్గంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. అటువైపు వేగంగా ఓ కారు వచ్చింది. పోలీసులను గమనించి కారు ఆపి ఒక వ్యక్తి దిగి పారి పోయే ప్రయత్నం చేశాడు. పోలీసులు అతడిని పట్టుకున్నారు. అతడు తమిళనాడుకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. కారులోని 24 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.20లక్షలు ఉంటుంది. దుంగలు సహా నిందితుడిని తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ రఫీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రేపటి నుంచి సాక్షాత్కార వైభవోత్సవాలు



చంద్రగిరి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో సోమవారం నుంచి జూలై 2వ తేదీ వరకు సాక్షాత్కార వైభవోత్సవాలు నిర్వహించనున్నారు. ఇందుకోసం ఆలయంలో విద్యుత్, పుష్పాలంకరణలు చేపట్టారు. పెద్దశేష, హనుమంత, గరుడ వాహనాలను సిద్ధం చేశారు. సోమవారం రాత్రి 7 గంటలకు పెద్దశేష వాహనంపై స్వామివారు విహరించనున్నారు. జూలై 1న హనుమంత వాహనంపై, 2న గరుడ వాహనంపై ఊరేగి భక్తులను అనుగ్రహించనున్నారు. జూలై 3వ తేదీ ఉదయం 7 నుంచి 11 గంటల వరకు ఉత్సవమూర్తులు పార్వేట మండపానికి వేంచేపు చేస్తారు. అక్కడ మధ్యాహ్నం 2 గంటల వరకూ పార్వేట ఉత్సవం జరుగనుంది. ఈ సందర్భంగా ఆస్థానం, వైదిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఈ క్రమంలో ఈనెల 30 నుంచి జూలై 3వ తేదీ వరకూ నిత్య కల్యాణోత్సవం, తిరుప్పావడ సేవ, స్వర్ణపుష్పార్చన, అష్టోత్తర శతకలశాభిషేకం సేవలను రద్దు చేసినట్లు ఆలయ వర్గాలు తెలిపాయి.

వైభవంగా 'పాండవ విద్యాభ్యాసం'

శ్రీకాళహస్తి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా శ్రీకాళహస్తిలో వెలసిన ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజైన శనివారం పాండవ విద్యాభ్యాసం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి అమ్మవార్లను విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్జునుడు, ద్రౌపది, శ్రీకృష్ణుడి ఉత్సవమూర్తుల నగరోత్సవం జరిగింది. ఆలయంలో జరిగిన పాండవ విద్యాభ్యాసం తిలకించడానికి భక్తులు పెద్దసంఖ్యలో వచ్చారు. రాత్రి స్వామి అమ్మవార్లు పురవీధుల్లో ఊరేగారు. భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ బిల్లులు చెల్లించండి

తిరుపతి (ఆటోనగర్), జూన్28(ఆంధ్రజ్యోతి): తిరుపతి టౌన్ డివిజన్ పరిధిలో వున్న విద్యుత్ వినియోగదారుల సౌలభ్యం కోసం ఆదివారం సెలవ అయినప్పటికి తమ రెవిన్యూ కార్యాలయాలు పని చేస్తాయని ఈఈ చంద్రశేఖర్ రావు తెలిపారు. విద్యుత్ బిల్లులు చెల్లించని వినియోగాదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

శేష వాహనంపై పరాశరేశ్వరుడు



నారాయణవనం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన నారాయణవనంలో వెలసిన టీటీడీ అనుబంధ ఆలయమైన చంపక వల్లీ సమేత పరాశరేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామి అమ్మవార్లు శేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. నిత్యకైంకర్యాలు నిర్వహించిన అనంతరం వేద మంత్రాల నడుమ ప్రత్యేక పుష్పాలతో, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారితో సహా అమ్మవారిని ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. సాయంత్రం 7 గంటలకు చంపకవల్లీ సమేత పరాశరేశ్వరస్వామి వారిని వివిధ పుష్పాలతో అలంకరించి శేష వాహనంపై అధిరోహింపజేసి, పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు నారికేళ, కర్పూర నీరాజనాలతో దర్శించుకున్నారు.

దాడి గర్హనీయం

తిరుపతి (జీవకోన), జూన్ 28(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని మహాన్యూస్ ప్రధాన కార్యాలయంపై బీఆర్ఎస్ శ్రేణుల దాడిని తిరుపతిలో జర్నలిస్టు సంఘాలు తీవ్రంగా ఖండించాయి. శనివారం స్థానిక గాంధీ రోడ్డు సర్కిల్ వద్ద దాడిని ఖండిస్తూ నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు మురళి, ఏపీయూడబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శి నరేంద్ర, చిన్న పత్రికల యూనియన్ నేతలు లక్ష్మీపతి, హరిబాబు, వివిధ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

శనీశ్వరస్వామికి పూజలు

శ్రీకాళహస్తి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయంలో వెలసిన శనీశ్వర స్వామికి విశేష పూజలు నిర్వహించారు. శనివారం విశేషాన్ని పురస్కరించుకుని ఉదయం శనీశ్వర సన్నిధిని మంత్ర జలాలతో శుద్ధి చేశారు. అనంతరం శని దోష నివారణ, శనీశ్వర స్వామి ప్రీతి కొరకు తైలాభిషేకంతో పాటు వివిధ పూజా ద్రవ్యాలతో విశేషంగా అభిషేకాలు నిర్వహించారు. భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

మందుబాబుల ఆగడాలకు నిలయాలివి!



సమావేశ, ధ్యాన మందిరాల చుట్టూ పెరుగుతున్న కంపచెట్లు-వంగిపోయిన ఫ్యానులు



తాళాలు వేయకుండా తెరిచివున్న గేటు

తిరుపతి అర్బన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మంగళం పరిధిలోని మిట్టగాంధీపురంలో గత ప్రభుత్వ హయాంలో తుడా నిధులతో నిర్మించిన సమావేశ, ధ్యానమందిరాలు మందుబాబులకు నిలయాలుగా మారాయి. మంగళం పరిధిలో ఐదు పంచాయతీలు ఉన్నాయి. అయితే సప్తగిరి కాలనీ, శెట్టిపల్లి పంచాయతీలకు సంబంధించిన మందిరాలు కార్యాలయం ప్రాంగణంలో కాకుండా దూర ప్రాంతంలో నిర్మించారు. సప్తగిరి కాలనీలో కాస్త మెరుగ్గావున్నా శెట్టిపల్లి పంచాయతీకి సంబంధించి మిట్టగాంధీపురంలో ఉన్న సమావేశమందిరం, ధ్యానమందిరాలను అసంపూర్తిగా ఉండగానే ప్రారంభించినట్లు తెలుస్తోంది. దీంతో అవి ప్రజలకు ఏ విధంగానూ ఉపయోగపడడంలేదు. అనతి కాలంలోనే బల్బులు, ఫ్యాన్స్ పాడైపోయాయి.

ప్రవేశ, నిష్క్రమణ గేట్లకు తాళాలు కరువయ్యాయి. నిత్యం తెరిచివుంటున్నాయి. మందిరాల లోపల వాటర్ బాటిల్స్, చిత్తుపేపర్లు, ఇతర వ్యర్థాలు పేరుకున్నాయి. వెలుపల, చుట్టూ కంపచెట్లు, ఇతర మొక్కలు పెరిగిపోయాయి. గోడలకు రంగులు మినహా మిగిలినవన్నీ పాడైపోయాయి. పర్యవేక్షణ లేకపోవడంతో రాత్రివేళలలో అల్లరిమూకలకు అడ్డాగా మారాయి. పంచాయతీ అధికారులు దృష్టిసారించి మందిరాలను పర్యవేక్షించాలని పలువురు కోరుతున్నారు.



ధ్యానమందిరం లోపల పేరుకున్న వ్యర్థాలు

6న అబాకస్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్సను జయప్రదం చేయండి

● తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాలర్స్ దివాకర్‌రెడ్డి, డాక్టర్ తాతిరెడ్డి రామకృష్ణారెడ్డి తదితరులు

తిరుపతి(విద్య), జూన్ 28(ఆంధ్రజ్యోతి): లండన్‌కు చెందిన వండర్ బుక్ ఆఫ్ రికార్డు కోసం వచ్చేనెల 6వ తేదీన తిరుపతిలో నిర్వహించనున్న అబాకస్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను తుడా కార్యాలయంలోని తన చాంబర్‌లో శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి ఆర్.కె. అబాకస్ ఆధ్వర్యంలో జూలై 6వ తేదీన స్థానిక ఎం.ఆర్.పల్లిలోని యూత్ హాస్టల్లో ఉదయం 7.50 నుంచి 8.30 వరకు ఈ కార్యక్రమం జరుగనుందని చెప్పారు. వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధుల సమక్షంలో 567 మంది విద్యార్థులతో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో జిల్లాలోని అబాకస్ విద్యార్థులందరూ పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. పాల్గొనదలచినవారు 99895 00074 నంబరులో సంప్రదించి తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఆర్.కె. అబాకస్ చైర్మన్ డాక్టర్ తాతిరెడ్డి రామకృష్ణారెడ్డి, గేట్ గ్రూప్ఆఫ్ ఇన్‌స్టిట్యూట్స్ చైర్మన్ డాక్టర్ తమ్మినేని వెంకటేశ్వర్లు, విశ్వం విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

2న మెగా జాబ్‌మేళా

తిరుపతి అర్బన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కులమతాలకు అతీతంగా పేటీఎం, జెప్టో, రిప్యూటెడ్ రీటెయిల్ కంపెనీల ద్వారా వచ్చేనెల 2న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్షులు దిండుకుర్తి నరసింహులు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక ఆర్యవైశ్య సంఘం కార్యాలయంలో బుధవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4వరకు జాబ్‌మేళా నిర్వహించనున్నారు. తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట, శ్రీకాళహస్తి వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, వివరాల కోసం 9154695289, 9848647123నెంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

సత్యనారాయణపురం సర్కిల్లో ట్రాఫిక్ సమస్య

● పట్టించుకోని అధికారులు



తిరుపతి (జీవకోన), జూన్ 28 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని జీవకోన సత్యనారాయణపురం సర్కిల్లో నిత్యం ట్రాఫిక్ సమ్యతో ప్రజలు సతమతమవుతున్నారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 6.30 గంటల వరకు ఈ సర్కిల్లో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంటోంది. దాదాపు 60 వేలకు పైగా జనాభా కలిగిన జీవకోన ప్రాంతంలో సత్యనారాయణపురం సర్కిల్ మీదుగానే ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. స్కూళ్లకు, పనులకు వెళ్లేవారంతా కూడా ఆ సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు చొరవ తీసుకుని ఆ సమయంలో ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను ఏర్పాటు చేసి సమస్యకు పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

సీబీఎస్ ఏటీఎంగా భాస్కర్

తిరుపతి(ఆర్టీసీ) జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ తిరుపతి సెంట్రల్ బస్సుస్టేషన్ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్‌గా భాస్కర్‌ను నియమించారు. ఇప్పటి వరకు ఉన్న డి.ఆర్.నాయుడు సోమవారం ఉద్యోగ విరమణ చేస్తున్న నేపథ్యంలో ఆయన్ను నియమించారు. ఈయన ప్రస్తుతం మంగళం డిపో మేనేజర్‌గా ఉన్నారు. కాగా మంగళం డిపో మేనేజర్‌గా పుంగనూరు డిపో మేనేజర్‌గా పనిచేస్తున్న సుధాకర్‌ను నియమించారు. త్వరలో వీరు బాధ్యతలు స్వీకరించనున్నారు.

మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్



తిరుపతి, కలెక్టరేట్, జూన్28(ఆంధ్రజ్యోతి): మామిడికి గిట్టుబాటు ధర కల్పించాలని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ అన్నా రు. శనివారం కలెక్టరేట్ ముందు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సొంత జిల్లాలోని మామిడి రైతులను వెంటనే ఆదుకోవాలని కోరారు. కలెక్టర్ వెంకటేశ్వర్లు మామిడి శుద్ధి కేంద్రాన్ని పరిశీలించాలని కోరారు. జపాన్, అమెరికా, యూరప్, లండన్‌లో వంటి దేశాల్లో మామిడి పండ్లకు విలువ ఎక్కువుందన్నారు. ఇక ప్రాథమిక పాఠశాలల సంఖ్యను తగ్గిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు యార్లపల్లి గోపి గౌడ్, తేజోవతి, రావణ్, వీరమోహన్, మణి, సమీ ఉల్లా, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు చేసింది శూన్యం

భూకబ్జాలు, మీ అభివృద్ధి తప్ప

● మాజీ మంత్రి పెద్దిరెడ్డి, భూమనకరుణాకరరెడ్డిపై ఆర్సీ మునికృష్ణ ధ్వజం



ప్రభుత్వం చేపడుతున్న పథకాలను ప్లకార్డుల రూపంలో ప్రదర్శిస్తున్న డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, రుద్రకోటి సదాశివం తదితరులు

తిరుపతి(జీవకోన), జూన్ 28(ఆంధ్రజ్యోతి): భూకబ్జాలు, మీ అభివృద్ధి తప్ప ప్రజలకు మీరు చేసింది శూన్యమని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డిపై డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ ధ్వజమెత్తారు. శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ అండ్ కో ముఖ్యమంత్రి చంద్రబాబుపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. గత వైసీపీ హయాంలో సీఎం తరువాత అన్నీ తానై వ్యవహరించిన పెద్దిరెడ్డి, భూమన జిల్లాలో ప్రజలకు ఉపయోగపడే పని ఒక్కటైనా చేశారా అని ప్రశ్నించారు. వైసీపీ పరిపాలనతో రాష్ట్రం 30 సంవత్సరాలు వెనక్కి వెళ్లిపోయిందని, అటువంటి రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి వైపు నడపడానికి చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. వారికి ప్రధాని మోదీ అండగా ఉంటున్నారని తెలియజేశారు. అమరావతి, పోలవరం ప్రాజెక్టుల అభివృద్ధికి అడుగులు పడుతున్నాయన్నారు. పర్యటనల పేరుతో జగన్ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని విమర్శించారు. ఒక అవకాశమిస్తే రాష్ట్రాన్ని సర్వనాశం చేశారని, ఆ ఫలితమే 11 సీట్లని తెలియజేశారు. బాంద్రీ షాపుల వద్ద తిరిగి పబ్లిసిటీ పెంచుకునేందుకు నాయకులు ప్రయత్నిస్తున్నారని భూమనపై విమర్శలు చేశారు. నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం మాట్లాడుతూ అసత్యపు ఆరోపణలు, ప్రచారాలు చేసి వైసీపీ తమ ఉనికిని చాటుకునేందుకు ప్రయత్నిస్తోంద న్నారు. ప్రజలు అసత్యపు ఆరోపణలు నమ్మే పరిస్థితిలో లేరని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు కరాటే చంద్ర, సుబ్బయాదవ్, అశోక్, శ్రీరాములు, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మంచినీళ్లగుంట కలుషిత సమస్యను పరిష్కరిస్తాం

● కలెక్టర్, ఎమ్మెల్యే హామీ



మంచినీళ్లగుంటను పరిశీలిస్తున్న కలెక్టర్

తిరుపతి, జూన్28(ఆంధ్రజ్యోతి): మంచినీళ్లగుంట కాలుష్యం సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కలెక్టర్ వెంకటేశ్వర్ హామీ ఇచ్చారు. కార్పొరేటర్ నరసింహాచారి విజ్ఞప్తి మేరకు కమిషనర్ మౌర్య, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణలతో కలిసి ఎమ్మెల్యే, కలెక్టర్ శనివారం సాయంత్రం మంచినీళ్లగుంటను పరిశీలించారు. అక్కడే ఉన్న గోవిందరాజస్వామి రాతి విగ్రహాన్ని వారు పరిశీలించారు. గోవిందరాజ స్వామి అభిషేకానికి ఇప్పటికీ మంచినీటిగుంట నీటినే వాడుతున్నారని నరసింహాచారి వారికి తెలియజేశారు. మంచినీళ్లగుంట కాలుష్యం సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లడంతో పాటు టీటీడీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని కలెక్టర్ తెలియజేశారు. మంచినీళ్లగుంట కాలుష్యం తొలగింపునకు ఐఐటీ నిపుణలు అభిప్రాయం తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. రుయా, మంచినీళ్లగుంట పునరుద్ధరణ, టీటీడీకి అప్పగించడంపై త్వరలో నిర్ణయం తీసుకుం టామని తెలిపారు.

పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయండి

కమిషనర్ ఎన్.మౌర్య

తిరుపతి, జూన్28(ఆంధ్రజ్యోతి): నగరంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. శనివారం ఉదయం స్మార్ట్‌సిటీలో భాగంగా వినాయకసాగర్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను, నగరంలో పెండింగ్ లో ఉన్న పనులను స్మార్ట్‌సిటీ, ఇంజనీరింగ్ అధికారులతో కలసి కమిషనర్ పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ వినాయక సాగర్లో స్విమ్మింగ్ పూల్, గ్లో గార్డెన్ తదితరాలను పూర్తి చేయాలన్నారు. కొర్లగుంట వద్ద జరుగుతున్న డ్రైనేజీ కాలువ నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేసి వాహన చోదకులకు ఇబ్బందిలేకుండా చేయాలనిఆదేశించారు. లక్ష్మీపురం కూడలి, మామిడికాయల మండి వద్ద కూడళ్లలో ట్రాఫిక్ జామ్ అవుతోందనే ఫిర్యాదులు ఎక్కువ వస్తున్నాయని, ఇందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. కమిషనర్ వెంట డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, కార్పొరేటర్ ఆంజనేయులు, సూపరింటెం డెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మున్సిపల్ ఇంజినీర్ గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, స్మార్ట్ సిటీ ఈఈ.రవి తదితరులు ఉన్నారు.

సమాజం మెచ్చే స్థాయికి ఎదగాలి

● విద్యార్థులకు సూచించిన మహిళా డీఎస్పీ శ్రీలత

● నేషనల్ ఇంగ్లీష్ ఒలంపియాడ్ విజేతలకు బహుమతుల ప్రదానం



నేషనల్ ఇంగ్లిష్ ఒలింపియాడ్ విజేతలైన తెలుగు రాష్ట్రాల విద్యార్థులతో డీఎస్పీ శ్రీలత, మనసంస్కృతి ప్రతినిధి మస్తాన్ తదితరులు

తిరుపతి(గాంధీరోడ్డు), జూన్ 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించి సమాజం మెచ్చే స్థాయికి ఎదగాలని తిరుపతి మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ శ్రీలత విద్యార్థులకు సూచించారు. మన సంస్కృతి సంస్థ ఆధ్వర్యంలో జరిగిన నేషనల్ ఇంగ్లిష్ ఒలంపి యాడ్-2024 టాలెంట్ టెస్ట్ తెలుగు రాష్ట్రాల విజేతలకు బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమం శనివారం తిరుపతిలో జరిగింది. స్థానిక యూత్ హాస్టల్లో జరిగిన ఈ కార్యక్రమానికి డీఎస్పీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు మనకు ఉపయోగపడే అంశాలకోసం మాత్రమే సెల్‌ఫోన్‌ను ఉపయోగించాలని, అవసరానికి మించి సెల్‌ఫోన్‌ను ఉపయోగించ రాదని సూచించారు. అనంతరం విజేతలుగా నిలిచిన విద్యార్థులకు నగదు బహుమతులు, జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. సిద్ధవరం కేజీబీవీ ఆంగ్ల ఉపాధ్యాయురాలు నాగరత్నమ్మను, కురబలకోట కేజీబీవీ ఆంగ్ల ఉపాధ్యాయురాలు ధనలక్ష్మిని సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ నీరజ, ఉయ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్ పర్సన్ షేక్ తహసున్నీసా బేగం, డి.విజయకుమార్, వే ఫౌండేషన్ అధినేత డాక్టర్ అంకయ్య, మల్లారపు నాగార్జున, మన సంస్కృతి ప్రతినిధి డాక్టర్ షేక్ మస్తాన్ పాల్గొన్నారు.

కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిసిన తుడా చైర్మన్



తిరుచానూరు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్‌ను కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో కలిశారు. తుడా అభివృద్ధి పనులపై చర్చించారు.

మాదకద్రవ్యాలతో ఆరోగ్యం నాశనం

ఈఎస్ నాగమల్లేశ్వర రెడ్డి



తిరుపతి(నేరవిభాగం), జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల వినియోగంతో ఆరోగ్యం పాడవుతుందని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగమల్లేశ్వరరెడ్డి విజ్ఞప్తి చేశారు. తిరుపతి రుయా ఆస్పత్రిలో శనివారం ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో మత్తు వ్యసన నిర్మూలన కేంద్రం వారి ఆధ్వర్యంలో మద్యపానం, మాదక ద్రవ్యాలకు బానిసంగా మారిన వారికి అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈఎస్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వలన కలిగే అనర్థాలను వివరించారు. అనంతరం వారికి పండ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఎస్ వాసుదేవచౌదరి, ఎక్సైజ్ అర్బన్ సీఐ రామచంద్రయ్య, ఎస్ఐలు హరికృష్ణ, మానసిక విభాగం అధినేత మల్లికార్జునరావు, డాక్టర్ మానస, సైకాలజిస్టు డాక్టర్ మురళి, స్టేషన్ సిబ్బంది సుధాకర రాజు, శ్రీనివాసులు, సుధాకర్ పాల్గొన్నారు.

నగరంలో నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తిరుపతి (ఆటోనగర్), జూన్ 28(ఆంధ్రజ్యోతి): తిరుపతి విద్యుత్ టౌన్‌డివిజన్ పరిధిలోని తిరుపతి వేదాంతపురం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ ఫీడర్లు మరమ్మతులు, లైన్లు మరమ్మతులు చేయ డం, ట్రీకటింగ్ నిర్వహిస్తు న్న కారణంగా ఆదివారం ఉదయం 8గంటల మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుదని ఆ డివిజన్ ఈఈ చంద్రశేఖర్ రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ధనలక్ష్మీ నగర్,కలశంబిల్డింగ్, వేదాంతపురం, అవిలాల సమీప ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వివరించారు.

రాజ్యాధికారం దిశగా బీసీ ఆత్మగౌరవ సభ



మాట్లాడుతున్న జగదీష్

తిరుపతి అర్బన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రాజ్యాధికారమే సాధించుకునే దిశగా వచ్చేనెల 6న స్థానిక ఇందిరా మైదానంలో బీసీ ఆత్మగౌరవ సభ నిర్వహిస్తామని బీసీ సంక్షేమ సంఘం నగరాధ్యక్షుడు వడ్ల జగదీష్ అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజ్‌గౌడ్, కన్వీనర్ ఆల్మన్‌రాజు సంయుక్త ఆధ్వర్యంలో జరగనున్న సభకు పలువురు ప్రముఖులు హాజరవుతున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. సంఘం అధికార ప్రతినిధి బుజ్జిబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి సోమశేఖర్‌ఆచారి, విజయ్, రఘునాథ్‌సింగ్ పాల్గొన్నారు.




■ శ్రీవారి సేవలో ప్రముఖులు

హెచ్‌కే పాటిల్ - సమీర్

తిరుమల, జూన్28(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం కర్ణాటక మంత్రి హెచ్‌కే పాటిల్, సినీనటుడు సమీర్ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

కన్నుల పండువగా జగన్నాథ రథయాత్ర

సూళ్లూరుపేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో శనివారం సాయంత్రం జగన్నాథ రథయాత్ర అత్యంత వైభవంగా సాగింది. వీక్షించిన భక్తజనులు పరవశించారు. ఇస్కాన్ ఆధ్వర్యంలో రథయాత్ర భక్తుల కోలాహలం.. హరేరామ సంకీర్తనల నడుమ.. చిన్నారుల వేషధారణలు, కోలాటం.. భక్తుల భజనలతో షార్ బస్టాండు నుంచి ప్రారంభమైన 4 కిలో మీటర్ల దూరం సాగింది. షార్ బస్టాండు వద్ద వందలాది మంది భక్తుల జయజయ ధ్యానాలు, మంగళవాయిద్యాల మధ్య ఇస్కాన్ టెంపుల్ వారు పూజలు జరిపి రథోత్సవాన్ని ప్రారంభించారు. ప్రారంభమైన వెంటనే కారుమబ్బులు కమ్ముకుని ఒక నిమిషం పాటు ఆ ప్రాంతంలో తేలికపాటి జల్లుతో కూడిన వర్షం పడింది. ఇదంతా స్వామి మహిళ అని అక్కడి భక్తులు చర్చించుకోవడం కనిపించింది. ఫ్లైవోవర్ బ్రిడ్జి, జీఎన్‌టీ రోడ్డు మీదుగా రథాన్ని ఊరేగించారు. వేలాది మంది భక్తులు రథాన్ని లాగుతూ భక్తిని చాటారు. చెంగాళమ్మ ఆలయం సమీపంలోని శ్రీనగర్ కాలనీ వద్ద యాత్రను ముగించారు. ఈ సందర్భంగా భక్తుల నృత్యాలు, కోలాట ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.




శ్రీవారి దర్శనానికి 16 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 16 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 9 షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయి క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం: రూ.4.02 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 68,229

తలనీలాలు సమర్పించినవారు: 30,559



కథనం, ఇంటర్వ్యూ

తడ, సూళ్లూరుపేట (ఆంధ్రజ్యోతి)

తమిళనాడు సరిహద్దు నియోజకవర్గం సూళ్లూరుపేట. అంతర్జాతీయ ప్రఖ్యాతిగాంచిన శ్రీహరికోట రాకెట్ కేంద్రం, జాతీయ పారిశ్రామిక విజయపతాకం శ్రీసిటీ, ప్రకృతి ప్రసాదించిన వరం పులికాట్ సరస్సు ఈ నియోజకవర్గం కీర్తి కిరీటాలు. ఈ రిజర్వుడు నియోజకవర్గంలో రాజకీయంగా నిలదొక్కుకోవడం ప్రతి నిత్యమూ ఒక సవాలే. స్టెతస్కోప్ చేతబట్టుకుని అమాయకంగా రాజకీయ ప్రవేశం చేసిన నెలవల విజయశ్రీ తొలి ఏడాదిలోనే గట్టి ఎమ్మెల్యే అనే పేరు తెచ్చుకున్నారు. జనంలో తిరుగుతూ, సమస్యలు తెలుసుకుంటూ, అసెంబ్లీలో ప్రస్తావిస్తూ, అధినేతకు విన్నవించుకుంటూ ఆచితూచి అడుగులు వేస్తున్నారు. ఈ ఏడాది కాలంలో సూళ్లూరుపేట ఎమ్మెల్యేగా ఆమె సాధించినవీ, జనం ఆశిస్తున్నవీ, నెరవేర్చాల్సిన హామీల సమాహార సమీక్ష...



పులికాట్ ఫైలు కదిలింది!

- రూ.98కోట్లతో పూడికతీత పనులు మొదలవుతున్నాయి
- ఈ ఏడాదిలోనే మీజూరు చెక్‌డ్యాంల పనులు చేపడతాం
- అటవీ అనుమతుల కోసం ప్రయత్నిస్తున్నా ● కాళంగి గ్రాయిన్ ఫైలు కదిలింది

ఏడాదిలో ఏం చేశారు?

సూళ్లూరు పేట ఎమ్మెల్యే

డాక్టర్ నెలవల విజయశ్రీ



? పులికాట్‌లో పూడికతీత అన్నది మా కలగానే మిగిలిపోయింది.ప్రభుత్వాలు మారుతున్నాయిగానీ పని జరగడం లేదు. ఎమ్మెల్యేగారూ.. మీరు కూడా గత నాయకుల లాగే ఎన్నికల సమయంలో పూడిక తీయిస్తామని హామీ ఇచ్చారు. నెరవేరుస్తారనే ఆశతో ఉన్నాం.

- జయచంద్రన్, మత్స్యకారుడు, బీవీ పాలెం, తడ మండలం

! నేనిచ్చిన హామీని మరచిపోలేదు. పులికాట్ పూడికతీత గురించి సీఎం చంద్రబాబు కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. కేంద్రం రూ.98 కోట్లు నిధులిచ్చింది. ఏపీ మారిటైమ్ బోర్డు ద్వారా టెండర్లు కూడా పిలిచారు. జూలైలో టెండర్లు ఖరారవుతాయి. వెంటనే పనులు మొదలవుతాయి.

-ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ



? చెంబేడు చెరువును రిజర్వాయర్‌గా మారిస్తే చెరువు కింద 14గ్రామాల ఆయకట్టు భూములకు సాగునీరు అందుతుందని మేమంతా ఎన్నికల సమయంలో మిమ్మల్ని కోరాం. మీరు కూడా సానుకూలంగా స్పందించారు. మాట నిలబెట్టుకోండి ఎమ్మెల్యేగారూ.

- చెంబేటి రామయ్య, రైతు, చెంబేడు, పెళ్లకూరు మండలం

! ఇచ్చిన మాట నెరవేర్చి తీరుతాను. రూ.16 కోట్ల అంచనా వ్యయంతో చెంబేడు మినీ రిజర్వాయర్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశాం. సీఎంవోకు పంపించాం.నిధుల కోసం సీఎం చంద్రబాబును అభ్యర్థించాం.ఈ ఏడాదిలో పనులు మొదలు పెట్టించేందుకు ప్రయత్నిస్తున్నా.

- ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ



? ఎమ్మెల్యేగారూ మీజూరు వద్ద చెక్‌డ్యాంలు కట్టిస్తామని ఎన్నికలకు ముందు మీరు హామీ ఇచ్చారు.చెక్‌డ్యాంలు కట్టిస్తే వాన నీరంతా పులికాట్‌లో కలిసిపోకుండా ఆగుతుంది.మీజూరు, వేలికాడు, నాగినేరి, కారికాడు, బేరుజంగాలపల్లి గ్రామాలకు చెందిన 7 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది.

-వి. వెంకటేశ్వర్లు, మీజూరు , దొరవారిసత్రం మండలం

! 2018లో టీడీపీ ప్రభుత్వం ఇక్కడ నాలుగు చెక్‌డ్యామ్‌ల నిర్మాణం మొదలుపెట్టింది. కేంద్ర అటవీ శాఖ అభ్యంతరాలతో పునాదుల దశలోనే పనులు ఆగిపోయాయి. తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇపుడు చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి రూ.6 కోట్లు మంజూరు చేయాలని సీఎం చంద్రబాబును కోరాం.అటవీ శాఖ అనుమతులు కూడా తెప్పించి ఈ ఏడాదిలో పనులు చేపడతాం.

- ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ



? పులికాట్‌లో ఉండే ఊరు మాది. కొరిడి-పేర్నాడు బాట బాగుంటేనే బయటి ప్రపంచంతో మాకు సంబంధాలుంటాయి. ఈ మట్టి రోడ్డులో ప్రయాణం అంటే నడుములు విరిగిపోతాయి. వాన కురిస్తే కాలు కూడా కదపలేం.గెలిస్తే తారు రోడ్డు వేయిస్తానని మీరు హామీ ఇచ్చారు. గెలిచారు. ఏడాది అయ్యింది. మమ్మల్ని పులికాట్‌కి వదిలేయద్దమ్మా అని వేడుకుంటున్నాం.

- ఆకాశ పాలెయ్య, రాగన్న పట్టెడ, సూళ్లూరుపేట మండలం

! ఈ రోడ్డును నేను వదిలేయలేదు. పర్యావరణ పరంగా ఇది సున్నితమైన ప్రాంతం. 23 కిలోమీటర్ల కొరిడి-పేర్నాడు తారు రోడ్డు నిర్మాణానికి అటవీ శాఖ అనుమతించడం లేదు. ఈ ప్రాంత ప్రజల కష్టాల గురించి అసెంబ్లీలో ప్రస్తావించాను.సీఎం, డిప్యూటీ సీఎంలను కలసి విన్నవించా. జూలైలో డిప్యూటీ సీఎంను మరోసారి కలసి అటవీ అనుమతులు తెప్పించేందుకు కృషి చేస్తా.ఈ ఏడాదిలోనే పనులు చేపట్టేందుకు ప్రయత్నిస్తున్నా.

- ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ



ఐదేళ్ళ విరామం తర్వాత ఫ్లెమింగో ఫెస్టివల్ తిరిగి ప్రారంభించిన దృశ్యాలు

సూళ్లూరుపేట నియోజకవర్గానికి ప్రపంచ పర్యావరణ, పర్యాటక రంగంలో గుర్తింపు తెచ్చిన ఫ్లెమింగో ఫెస్టివల్‌ను పునరుద్ధరించే విషయంలో ఎమ్మెల్యే విజయశ్రీ కీలక పాత్ర పోషించారు. 2020 జనవరిలో చివరిసారిగా ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహించగా తర్వాత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. టీడీపీ ప్రభుత్వం వచ్చాకే ఈ ఏడాది జనవరిలో ఈ బర్డ్ ఫెస్టివల్‌ను తిరిగి ప్రారంభించింది. దీనికోసం విజయశ్రీ సీఎం చంద్రబాబును కలసి గట్టి ప్రయత్నం చేసి, ఘనంగా నిర్వహించారు.

కొరిడి-పేర్నాడు రోడ్డు దుస్థితి



? ఈ ఏడాదిలో ఎమ్మెల్యేగా మీరు సూళ్లూరుపేట నియోజకవర్గానికి చేసిన పనులేమిటి

! సుమారు రూ.150 కోట్లతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టాం. నిరంతరం ప్రజల్లో తిరుగుతూ ఉన్నపుడు కష్టాల్లో ఉన్న అనేకమంది తారసపడ్డారు. వీరికి సీఎం సహాయ నిధి నుంచి రూ.3 కోట్లు మంజూరు చేయించా.

● నియోజకవర్గంలోని రెండు మున్సిపాలిటీల్లో రూ.8.42 కోట్లతో పనులు చేపట్టాం. సూళ్లూరుపేట మున్సిపాలిటీలో రూ.5.62 కోట్లతో 29 పనులు చేయించాం. నాయుడుపేట మున్సిపాలిటీలో రూ.2.80 కోట్లతో 34 పనులు చేపట్టాం.



గత వైసీపీ ప్రభుత్వంలో నాయుడుపేట పట్టణంలో విన్నమాల మెయిన్ రోడ్డు దుస్థితి



విన్నమాల మెయిన్ రోడ్డు ప్రస్తుత స్థితి

● నియోజకవర్గంలో అయిదేళ్లుగా అతీగతీ లేకుండా దారుణ స్థితిలో అనేక రోడ్లు కనిపించాయి. రూ.13.70 కోట్లతో 22 పనులు చేపట్టి 83.27 కి.మీ.ల ఆర్ అండ్ బీ రోడ్లు బాగు చేయించాం. పీఆర్ శాఖలో రూ.20.26 కోట్లతో 269 పనులు చేపట్టి 41.5 కి.మీ. సీసీ రోడ్లు వేయించాం. రూ.27.56 కోట్లతో తారు రోడ్లు వేయించాం. ఓజిలి కరబల్లవోలు రోడ్డు నుంచి అయ్యవారిపాలెం వరకూ రూ.8.38 కోట్లతో రోడ్డు వేయించాం. నాయుడుపేట ఎన్‌హెచ్ 16 నుంచి కమ్మవారిపాలేనికి రూ. 4.30 కోట్లతో బీటీ రోడ్డు వేస్తున్నాం. నాయుడుపేట నుంచి చిగురుపాడు అగ్రహారానికి రూ.1.95 కోట్లతో బీటీ రోడ్డు వేస్తున్నాం. తడ ఎంసీ రోడ్డు నుంచి బీవీ పాలేనికి రూ.63 లక్షలతో బీటీ రోడ్డు వేస్తున్నాం. రూ. 12.30 కోట్లతో పెళ్లకూరు మండలంలో కాళంగిపై హైలెవల్ బ్రిడ్జి నిర్మిస్తున్నాం. ఇంకా రూ.1.05 కోట్లతో నాలుగు అంగన్‌వాడీ భవనాలు నిర్మించాం.ఐసీడీఎస్ ఆఫీసు భవనానికి మరమ్మతులు చేయించాం.పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖలో మొత్తం రూ.47.82 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.

● తాగునీటికి ప్రాధాన్యం ఇచ్చా. ఆర్‌డబ్ల్యుఎస్ ద్వారా రూ.12.19 కోట్లతో 176 పనులు పూర్తి చేయించాం. రూ.65.24 కోట్లతో అనేక అభివృద్ధి పనులు చేశాం. తెలుగు గంగ కాలువల అభివృద్ధికి రూ.64.69 లక్షలతో 12 పనులు చేయించాం. రూ.4.31 కోట్లతో 187 గోకులం షెడ్లు నిర్మించాం. రూ.41.12 లక్షలతో బీసీ హాస్టళ్లను అభివృద్ధి పరిచాం.

● రూ.57.64 కోట్ల ఉపాధి హామీ నిధులతో 126 పనులు పూర్తయ్యాయి.

ఎమ్మెల్యే గారూ.. మీరిచ్చిన హామీలే ఇవి!

● సూళ్లూరుపేట సమ్మర్ స్టోరేజీ ట్యాంకు పనులు పూర్తి చేసి తాగునీటిని అందించడం ● దొరవారిసత్రం మండలంలో 14 ఆర్ తెలుగు గంగ కాలువ నిర్మాణం పూర్తి చేయించడం ● నాయుడుపేట మండలం జువ్వలపాలెం సమ్మర్ స్టోరేజీ ట్యాంకు పనులు పూర్తి చేయించడం ● నాయుడుపేట వద్ద స్వర్ణముఖి నదిలో చెక్ డ్యాములు నిర్మించడం ● సూళ్లూరుపేట వద్ద కాళంగి నదిపైన, నాయుడుపేటలో స్వర్ణముఖి నదిపైన వంతెనల నిర్మాణం.



అసంపూర్తిగా వున్న సూళ్ళూరుపేట సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నిర్మాణం



4.47 కేజీల వెండి విరాళం

శ్రీకాళహస్తి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి గుంతకల్లుకు చెందిన రాజు అనే వ్యాపారి 4.47 కేజీల వెండిని విరాళంగా సమర్పించారు. శనివారం దాత కుటుంబ సమేతంగా ముక్కంటి ఆలయానికి విచ్చేశారు. ఆలయ పరిపాలనా భవనంలో ఈవో బాపిరెడ్డిని కలిసి వెండి అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతను ఘనంగా సత్కరించి, ప్రత్యేక దర్శనం కల్పించిన అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఎనిమిది మందికి గాయాలు





ప్రమాదంలో దెబ్బతిన్న ఆటో - చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

శ్రీకాళహస్తి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఆటోను గుర్తుతెలియని కారు ఢీకొట్టి వెళ్లడంతో 8 మంది గాయపడిన ఘటన శ్రీకాళహస్తి మండలంలోని రాచగున్నేరి పంచాయతీ కోళ్లఫారం సమీపంలో శనివారం సాయంత్రం పీఎన్ జాతీయరహదారిపై జరిగింది. బాధితుల కథనం మేరకు... శ్రీకాళహస్తి మండలం ఎగువవీధి గ్రామానికి చెందిన మౌనిష్ అనే యువకుడు ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ జీవిస్తున్నాడు. 8 మంది కుటుంబ సభ్యులతో కలిసి శనివారం ఉదయం గూడూరు సమీపంలోని బంధువుల ఇంట్లో జరిగే శుభకార్యానికి ఆటోలో వెళ్లారు. తిరిగి సాయంత్రం ఇంటికి ఆటోలో బయలుదేరారు. కోళ్ల ఫారం దగ్గర జాతీయ రహదారిపై గుర్తు తెలియని కారు ఆటోను ఢీ కొట్టి వెళ్లిపోయింది. ఈ ఘటనలో ఆటో రోడ్డు పక్కకు బోల్తా కొట్టింది. అందులో ప్రయాణిస్తున్న మౌనిష్‌తోపాటు జాహ్నవి, సుబ్బయ్య, అంకమ్మ, విశాలాక్షి, అన్విత్(5) షర్మిల(4) గాయపడ్డారు. స్థానికులు గుర్తించి క్షతగాత్రులను చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. శ్రీకాళహస్తి రూరల్ పోలీసులు ఘటనపై బాధ్యుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టారు.

లారీని ఢీకొన్న కారు

● ఒకరి మృతి, ఆరుగురికి గాయాలు



చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

పెళ్లకూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - రేణిగుంట జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ఆరుగురికి గాయాలయ్యాయి. ఎస్‌ఐ నాగరాజు తెలిన వివరాల మేరకు... శ్రీకాకుళం జిల్లాకు చెందిన మెహంతి సరస్వతి కుటుంబం హైదరాబాదులో నివాసం ఉంటోంది. శనివారం కుటుంబ సభ్యులందరూ కారులో హైదరాబాదు నుంచి తిరుమలకు బయలుదేరారు. పెళ్లకూరు మండలంలోని ఎగువచావాలి వద్దకు రాగానే వెనుక వస్తున్న లారీ ఓవర్‌టెక్ చేసి ముందు వెళ్తూ షడన్ బ్రేక్ వేసింది. దీంతో కారు లారీని వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో మెహంతి సరస్వతి(50), ఆమె భర్త గోవిందరాజు, కుమార్తె సాయినవ్య, లహరి, చెల్లెలు మీన తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని క్షతగాత్రులను శ్రీకాళహస్తిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స అందిస్తుండగా మెహంతి సరస్వతి మృతి చెందారు. మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి పోస్టుమార్టం పూర్తి చేశాక బంధువులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీసిటీలో అలరించిన అన్నమాచార్య సంకీర్తనలు



సంకీర్తనలు ఆలపిస్తున్న మల్లాది అనూష

సత్యవేడు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) శ్రీసిటీ ఆధ్యాత్మిక సాహిత్య వేదిక శ్రీవాణి ఆధ్వర్యంలో శనివారం శ్రీసిటీ బిజినెస్ సెంటర్‌లో నిర్వహించిన అన్నమయ్య పంచామృత వర్షిణి కార్యక్రమం సంగీత ప్రియులను అలరించింది. హైదరాబాదుకు చెందిన ప్రఖ్యాత అన్నమాచార్య కీర్తనల పండితుడు గంధం బసవ శంకరరావు వ్యాఖ్యాతగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో నెల్లూరుకు చెందిన కుమారి మల్లాది అనూష వాయిద్య కళాకారులతో కలిసి 'బ్రహ్మమొక్కటే, అదిగో అల్లదిగో, చక్కని తల్లికి, చిన్ని శిశువు' తదితర అన్నమయ్య సంకీర్తనలను శ్రావ్యంగా ఆలపించారు. కాగా కీర్తనల ముందు శంకరరావు ఆ కీర్తనలకు సంబంధించిన సారాంశాన్ని, గొప్పదనాన్ని వివరించడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తిరుపతి శ్వేత మాజీ డైరెక్టర్ భూమన్, ఎస్కే యూనివర్సిటీ మాజీ వీసీ కుసుమకుమారి కళాకారులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి పల్లేటి బాలాజీ సమన్వయకర్తగా వ్యవహరించారు. శ్రీసిటీ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, సూళ్లూరుపేట, శ్రీహరికోట ప్రాంతాలకు చెందిన పలువురు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన డీపీటీవో



తిరుపతి(ఆర్బీసీ)/కలెక్టరేట్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): డీపీటీవోగా శుక్రవారం బాధ్యతలు చేపట్టిన జగదీష్ శనివారం కలెక్టర్ వెంకటేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి జాయినింగ్ రిపోర్టు ఇచ్చారు. కలెక్టర్ ఆయన్ను అభినందించారు. ప్రయాణికులకు మెరుగైన సేవలందించాలని, ప్రధానంగా రాబోవు శ్రీవారి బ్రహ్మోత్సవాలను దృష్టిలో ఉంచుకొని ముందుజాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు.

నాందేడ్-తిరుపతి మధ్య 16 ప్రత్యేక రైళ్లు

తిరుపతి(సెంట్రల్) జూన్28(ఆంధ్రజ్యోతి) తిరుపతిలో నెలకొన్న ప్రయాణికుల రద్దీని తగ్గించడానికి నాందేడ్ -తిరుపతిల మధ్య 16 ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో శ్రీధర్ తెలిపారు. కాగా 8 సర్వీసులు ఒక మార్గంలో, 8 సర్వీసులు మరో మార్గంలో నడుపనున్నామని వెల్లడించారు. ఈ ప్రత్యేక రైళ్లు జూలై 4నుంచి 27వ తేదీ వరకు రాకపోకలు సాగిస్తాయన్నారు. ● ఈ ప్రత్యేక రైలు(07189)నాందేడ్‌లో జూలై 4వ తేదీ శుక్రవారం సాయంత్రం 4.30 గంటలకు బయలుదేరి ముడికేడ్, దర్మాబాద్, బాసర, నిజామాబాద్, కామారెడ్డి, మేడ్చర్ల, చర్లపల్లి, నల్లగొండ, మిర్యాలగూడ, నడుకుడి, పిడుగురాళ్ల, నెమలిపురి, రొంపిచర్ల, వినుకొండ, దొనకొండ, మార్కాపురంరోడ్డు, కుంబ్బం, గిద్దలూరు, దేవరమిట్ట, నంద్యాల, జమ్మలమడుగు, ఎర్రగుంట్ల, కడప, నందలూరు, రాజంపేట, కోడూరు, రేణిగుంట స్టేషన్ల మీదుగా మరుసటి రోజు మధ్యాహ్నం 12.30గంటలకు తిరుపతికి చేరుకొంటుంది. ● తిరుపతిలో ఈ ప్రత్యేక రైలు(07190) శనివారం మధ్యాహ్నం 2.20 గంటలకు బయలుదేరి వచ్చిన మార్గంలో ప్రయాణిస్తూ ఆదివారం ఉదయం 9.30 గంటలకు నాందేడ్ చేరుకొంటుంది. ● ఈ ప్రత్యేక రైలు(07015)నాందేడ్‌లో జూలై 5వ తేదీ శనివారం సాయంత్రం 4.50 గంటలకు బయలుదేరి ముడికేడ్, దర్మాబాద్, బాసర, నిజామాబాద్, కామారెడ్డి, మేడ్చర్ల, మల్కజ్‌గిరి, కాచిగూడ, ఉందానగర్, షాద్‌నగర్, జడ్చర్ల, మహబుబ్‌నగర్, వనపర్తి రోడ్డు, గద్వాల, కర్నూల్ సిటీ, డోన్, గుత్తి, తాడిపత్రి, ఎర్రగుంట్ల, కడప, ఒంటిమిట్ట, రాజంపేట, కోడూరు, రేణిగుంట స్టేషన్ల మీదుగా మరుసటి రోజు ఉదయం 10.10గంటలకు తిరుపతికి చేరుకొంటుంది.

● తిరుపతిలో ఈ ప్రత్యేక రైలు(07016) ఆదివారం సాయంత్రం 4.40 గంటలకు బయలుదేరి వచ్చిన మార్గంలో ప్రయాణిస్తూ సోమవారం మధ్యాహ్నం 1.15 గంటలకు నాందేడ్ చేరుకొంటుంది. ఈ ప్రత్యేక రైళ్లలో 1, 2, 3, ఏసీలతోపాటు సెకండ్ క్లాస్ స్లీపర్ కోచ్‌లు, సాధారణ కోచ్‌లు కూడా ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

హైదరాబాదులో పట్టుబడ్డ ఏనుగు దంతాలు

భాకరాపేటలో చోరీకి గురైనవేనా..?

● అటవీ శాఖలో కలకలం ● చోరీకి గురైన గన్ ఎక్కడ?

తిరుపతి (మంగళం) జూన్ 28(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ పోలీసులకు చిక్కిన ఏనుగు దంతాలు భాకరాపేట అటవీశాఖ రేంజ్ ఆఫీసులో చోరీకి గురైనవేనా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏనుగు దంతాలను తరలిస్తూ పట్టుబడ్డ డ్రైవర్ ప్రసాద్ అన్నమయ్య జిల్లా రాయచోటికి చెందినవాడు. ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తూ ఫిబ్రవరిలో టాస్క్‌ఫోర్స్ పోలీసులకు చిక్కి జైలుకు కూడా వెళ్లాడు. కొన్ని రోజుల క్రితం హైదరాబాద్ బస్సులో ప్రయాణిస్తున్న అతని వద్ద ఏనుగు దంతాలు లభించడం సంచలనమే సృష్టించింది. తమిళనాడు, కర్ణాటక సరిహద్దుల్లోని అడవుల్లో గంధపు చెక్కల స్మగ్లర్ వీరప్పన్ హయాంలో ఏనుగులను చంపి వాటి దంతాలను స్మగ్లింగ్ చేశారు. ఆ తర్వాత తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడ ఏనుగులను వేటాడి చంపిన దాఖలాలు లేవు. తాజాగా ప్రసాద్ చేత పట్టుబడ్డ ఏనుగు దంతాలు ఎక్కడివి అనే ప్రశ్న అందరిరీ కలవరపాటుకు గురిచేస్తోంది. అటవీ శాఖ అధికారులు దీనిపై అంతర్గతంగా విచారణ చేపట్టినట్లు సమాచారం.

విచారణాధికారిని నియమించాం : సీసీఎఫ్ సెల్వం

ఈ వ్యవహారంలో విచారణ అధికారిగా అన్నమయ్య జిల్లా డీఎఫ్‌ఓ జగన్నాథ్ సింగ్‌ను నియమించాం.హైదరాబాద్ పోలీసులతో కేసుకు సంబంధించిన ఫైల్ తెప్పించి పట్టుబడ్డ ఏనుగు దంతాలు ఎక్కడ నుంచి స్మగ్లింగ్ జరిగాయి అన్న దానిపై పూర్తి స్థాయి విచారణ జరిపిస్తాం.

భాకరాపేట అటవీ శాఖ కార్యాలయంలో చోరీ..

2013లో తలకోన అటవీ ప్రాంతాల్లో రెండు ఏనుగులు ప్రమాదవశాత్తు మృతి చెందాయి. ఇందులో ఒక ఏనుగుకు సంబంధించిన దంతాలు పోస్టుమార్టం అనంతరం తొలగించి భాకరాపేట రేంజ్ ఆఫీసులో భద్రపరిచారు. అయితే 2023లో భాకరాపేట రేంజ్ ఆఫీసులో ఉన్న ఏనుగు దంతాలతో పాటుగా ఒక గన్ కూడా చోరీకి గురైంది. దీనిని గుర్తించిన అటవీశాఖ అధికారులు భాకరాపేట పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఈ కేసులో నిందితులు ఎవరో గుర్తించలేకపో యారు. అయితే ఈ చోరీ జరిగిన విషయం రహస్యంగా ఉంచారు. అటవీ శాఖ ఉన్నతాధికారులకు సైతం ఈ విషయం తెలుసా అన్నది అనుమానంగానే ఉంది. భాకరాపేట పోలీస్‌స్టేషన్లో 87-23 నంబర్‌తో కేసు కూడా నమోదైంది.

అటవీశాఖ అధికారులు గుబులు

దాదాపు ఒకటిన్నర సంవత్సరం తర్వాత భాకరాపేట రేంజ్ ఆఫీసులో అదృశ్యమైన దంతాలు హైదరాబాదులో పట్టుబడ్డ దంతాలు ఒకటేనేమో అన్న అనుమానంతో అటవీశాఖ అధికారుల్లో గుబు లు మొదలైంది. ఏనుగు దంతాలు, గన్ కావడంతో బయటకు చెప్పుకుంటే పరువు పోతుందని అటవీ శాఖ అధికారులు భయపడ్డా నేడు బయట పెట్టడం అనివార్యంగా కనిపిస్తోంది. హైదరాబాద్‌లో దొరికిన ఏనుగు దంతాలతో పాటు గన్ కూడా ప్రసాద్ వద్ద ఉందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

సమయాన్ని మరిచిన గడియారం
మూడు వైపులా ఒకలా... ఒకవైపు మరోలా..


ఓ వైపు సరైన సమయం చూపుతూ, మరో వైపు పనిచేయని టవర్‌క్లాక్‌లోని గడియారం

గూడూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టవర్‌క్లాక్ సెంటర్ గూడూరు పట్టణానికి ఐకాన్‌గా నిలుస్తోంది. పట్టణ నడిబొడ్డున నాలుగు దిక్కులూ కలిసే కూడలిలో 1975లో దాతల సహకారంతో టవర్‌క్లాక్ ఏర్పాటు చేశారు. అప్పట్లో గూడూరులో మైకా పరిశ్రమలు ఉండేవి. వీటిల్లో పనిచేసేందుకు గూడూరు సమీప గ్రామాల నుంచి ప్రజలు వస్తుండే వారు. అంతేకాకుండా గూడూరు డివిజన్ కేంద్రం కావడంతో వివిధ పనుల మీద పలు గ్రామాల నుంచి ప్రజలు వస్తుంటారు. ఎటు వైపు నుంచైనా ప్రజలు సమయాన్ని తెలుసుకునేందుకు వీలుగా టవర్‌కు నాలుగు దిక్కుల్లో గడియారాలను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఈ ప్రాంతం టవర్‌క్లాక్ కేంద్రంగా పిలవబడుతూ గూడూరుకు ఐకాన్‌గా నిలిచిపోయింది. కాలక్రమేణా టవర్‌క్లాక్ శిథిలావస్థకు చేరుకోవడంతో 2021లో తొలగించారు. 2024లో దాతల సహకారంతో అధునాతన డిజైన్‌తో నూతన టవర్‌క్లాక్‌ను నిర్మించారు. రైల్వేస్టేషన్, ఆస్పత్రి రోడ్డు, రైతు బజారు సెంటర్, పాత బస్టాండుతో పాటు వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే నాలుగు దిక్కుల్లో టవర్‌కు గడియారాలను ఏర్పాటు చేశారు. అయితే కొంతకాలంగా రైతు బజారు సెంటర్ దిక్కులోని గడియారం పనిచేయడంలేదు. సంబంధిత అధికారులు స్పందించి టవర్‌క్లాక్‌లో అన్ని గడియారాలు పనిచేసేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

నత్తనడకన పోలేరమ్మ ఆర్చి నిర్మాణం
రాకపోకలకు ఇబ్బంది పడుతున్న పట్టణవాసులు
తరచూ ట్రాఫిక్ సమస్యతో వాహనదారుల అవస్థలు


పోలేరమ్మ ఆర్చి నిర్మాణం

వెంకటగిరి టౌన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని క్రాస్ రోడ్డులో నిర్మిస్తున్న వెంకటగిరి గ్రామదేవత పోలేరమ్మ ఆర్చి నిర్మాణం నత్తనడన సాగుతోంది. గత ఏడాది డిసెంబరు 14న ఆర్చి నిర్మాణానికి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ శంకుస్థాపన చేశారు. పనులు జరుగుతున్నందున ఆ మార్గంలో రాకపోకలు సాగించేందుకు వీలుగా ఓ పక్కన దారి వదిలారు. అది ఇరుకుగా ఉండడంతో వాహనాలు ప్రయాణించడానికి ఇబ్బందులు పడాల్సివస్తోంది. తిరుపతి, నాయుడుపేట, శ్రీకాళహస్తి వైపు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు క్రాస్ రోడ్డు మీదుగా ఆర్టీసీ బస్టాండుకు వెళ్లాలి. క్రాస్ రోడ్డులో ఆర్చి నిర్మాణ పనులు జరుగుతుండడంతో తరచూ ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. క్రాస్ రోడ్డు నుంచి కాకుండా పాలకేంద్రం వైపుగా బస్టాండుకు వెళ్లాలంటే అర్ధగంట పడుతుంది. ఇక క్రాస్ రోడ్డు - బస్టాండు మధ్య ఉండే రాణీపేట, టీచర్స్ కాలనీ తదితర ప్రాంతాల ప్రజలు రాకపోకలు సాగించడానికి నానాపాట్లు పడుతున్నారు. ఎమ్మెల్యే చొరవ తీసుకుని ఆర్చి నిర్మాణం త్వరగా పూర్తి చేయించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి



ర్యాలీ నిర్వహిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

గూడూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రసాద్ అన్నారు. శనివారం ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినాన్ని పురస్కరించుకుని కళాశాల నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు బానిసైతే భవిష్యత్తు అంధకారమవుతుందన్నారు. మత్తు పదార్థాలను వినియోగించినా, విక్రయించినా చట్టరీత్యా నేరమన్నారు. చెడు అలవాట్లకు బానిసలు కాకుండా మంచి అలవాట్లను అలవర్చుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, డాక్టర్ పీర్ కుమార్, కోటేశ్వరరావు, సురేంద్ర, కిరణ్మయి, శ్రీధర్‌శర్మ, రవిరాజు, శైలజ, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

మాలమహానాడు కమిటీ నియామకం

సూళ్లూరుపేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మాలమహానాడు జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యనమల సుదర్శనం తెలిపారు. శనివారం షార్ బస్టాండు వద్దనున్న అంబేడ్కర్ లైబ్రరీలో నూతన కమిటీల ఎన్నిక జరిగింది. తిరుపతి జిల్లా అధ్యక్షుడుగా మీజూరు మాధవ్, నెల్లూరు జిల్లా అధ్యక్షుడుగా బల్లి వెంకటయ్యను ఎన్నుకున్నారు. అలాగే తిరుపతి జిల్లా మహిళా అధ్యక్షురాలిగా బూదూరు మహేశ్వరి, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఆవుల సతీష్(దాస్), నియోజకవర్గ అధ్యక్షుడుగా జాన్ పీటర్, కన్వీనర్‌గా వీవీ రమణ, కార్యదర్శిగా ఇంగిలాల కిరణ్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీని సన్మానించారు.

మెమూ రైళ్లను నాయుడుపేట వరకు పొడిగించాలి

నాయుడుపేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): చెన్నై నుంచి సూళ్లూరుపేట వరకు వచ్చే మెమూ రైళ్లను నాయుడుపేట వరకు పొడిగించేలా చూడాలని ఎంపీ గురుమూర్తికి రైల్వే ప్యాసింజర్స్ అసోసియేషన్ నాయకులు విజ్ఞప్తి చేశారు. శనివారం వారు తిరుపతిలో ఎంపీని కలిసి వినతిపత్రం అందజేశారు. మెమూ రైళ్లను నాయుడుపేట వరకు పొడిగించడంతో పాటు కరోనా ముందు స్టాపింగ్ ఉన్న చెన్నై ఎక్స్‌ప్రెస్‌తో పాటు పలు రైళ్లను నాయుడుపేట స్టేషన్‌లో ఆపేలా చూడాలని కోరారు. ఎంపీ స్పందిస్తూ రైల్వే ఉన్నతాధికారులతో మాట్లాడి చర్యలు తీసుకునేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో సదరన్ రైల్వే ప్యాసింజర్స్ అసోసియేషన్స్ నాయకులు కామిరెడ్డి రాజారెడ్డి, మస్తానయ్య, ఎం.మస్తాన్, ఆర్.రాఘవన్, కిరణ్‌కుమార్, కిషోర్, డీఆర్‌యూసీసీ మెంబరు పేర్నాటి జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

జాయింట్ ఖాతా నంబర్లను సబ్‌డివిజన్ చేయండి

బాలాయపల్లి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో రీసర్వే పూర్తయిన కోనంగుంట, కరిమెనగుంట, పిగిలాం, సుబ్రహ్మణ్యం, వెంకటరెడ్డిపల్లి బాలాయపల్లి, సంగవరం, యాచవరం, రామాపురం గ్రామాల్లో జాయింట్ ఖాతా నంబర్లను సబ్‌డివిజన్ చేయాలని డివిజనల్ సర్వేయర్ సుబ్బరాయుడు అన్నారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, సచివాలయ సర్వేయర్లతో సమీక్ష నిర్వహించారు. జాయింట్ ఖాతా నంబర్ల వల్ల రైతులు ప్రభుత్వ పథకాలకు అర్హత కోల్పోతున్నారని చెప్పారు. ఒక్కో రైతుకు ఒక్కో నంబరు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయలక్ష్మి, ఆర్‌ఐ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు జడ్జికి సన్మానం


జస్టిస్ శ్రీనివాసులురెడ్డిని సన్మానిస్తున్న గంగరాజు

నాయుడుపేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసులు రెడ్డిని ఉమ్మడి నెల్లూరు జిల్లా బార్ అసోసియేషన్ ఈసీ మెంబరు పనబాక గంగరాజు సన్మానించారు. శనివారం నెల్లూరు జిల్లా కోర్టుకు వచ్చిన జస్టిస్ శ్రీనివాసులురెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు.

గ్యాస్ గోదాము కూల్చివేత కేసులో ఒకరి అరెస్టు

తడ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ గోదాము కూల్చివేత కేసులో ఒక నిందితుడిని పోలీసులు శనివారం అరెస్టు చేశారు. తడలోని సుభాషిణి గ్యాస్ ఏజెన్సీ గోదామును గురువారం అర్ధరాత్రి కొందరు కూల్చివేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు ఆధ్వర్యంలోని విచారణ జరిపారు. పులి వెంకటరమణయ్యను మొదటి నిందితుడిగా నిర్ధారించి అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచామని ఎస్‌ఐ కొండపనాయుడు తెలిపారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న కారు: ఇద్దరికి గాయాలు

పెళ్లకూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళాయిపాడు వద్ద జాతీయ రహదారి నుంచి సర్వీస్ రోడ్డులోకి వెళ్తున్న ఆర్టీసీ బస్సును కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో దువ్వూరు శ్రావణ్ కుమార్ రెడ్డి, రవీంద్రారెడ్డికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేగ నియంత్రణకు చర్యలేవీ?
ప్రధాన రహదారులపై స్పీడు బ్రేకర్లు లేక తరచూ ప్రమాదాలు


స్పీడ్ బ్రేకర్లు లేని సంగం థియేటర్ వద్ద కూడలి

గూడూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రాంతాల్లో ప్రధాన రహదారులపై స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రధాన రహదారి వెంబడి కూడళ్ల వద్ద, మలుపుల వద్ద స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో వాహనాల వేగాన్ని నియంత్రించలేక ప్రమాదాలకు గురవుతున్నారు. స్థానిక సాయిబాబాగుడి సమీపంలో గూడూరు పట్టణంలోకి వచ్చే ప్రధాన రహదారిపై గతంలో ఉన్న స్పీడ్ బ్రేకరును తొలగించారు. ఈ ప్రాంతంలో పాఠశాలలు, బ్యాంకులు, వివిధ కార్యాలయాలకు ప్రజలు వెళ్లి వస్తుంటారు. స్పీడ్‌బ్రేకర్లు లేకపోవడంతో వేగంగా వచ్చే వాహనాల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల విద్యార్థులు పాఠశాలకు వెళ్లే సమయంలో ఓ మోటారు సైకిల్‌ను ఆటో ఢీకొంది. అదేవిధంగా స్థానిక సంగం థియేటర్ కూడలి వద్ద తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ మార్గం ద్వారా పట్టణంలోకి వచ్చే వాహనాలు, ఆర్టీసీ బస్టాండు, రైల్వేస్టేషన్‌కు వెళ్లే వారు రాకపోకలు సాగిస్తుంటారు. నిత్యం రద్దీగా కూడలి వద్ద స్పీడ్‌బ్రేకర్లు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. స్థానిక మోతిమహల్ సెంటర్, ఏరియా ఆస్పత్రి ఎదురుగా, పాత బస్టాండుకు వెళ్లే మార్గంలో, రైల్వేస్టేషన్ సమీపంలోని మలుపు వద్ద, శాంతినగర్ అండర్‌బ్రిడ్జి సమీపంలోని మలుపు వద్ద నిత్యం వాహనాల రద్దీ ఉంటుంది. ఈ ప్రాంతాల్లో ఏదో ఒకచోట తరచూ వాహనాలు ప్రమాదాలకు లోనవుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదాలను నియంత్రించేందుకు ప్రధాన రహదార్లపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

సమర్థవంతమైన నాయకులను ఎన్నుకోండి


సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ పరిశీలకుడు శివప్రసాద్, పక్కన ఎమ్మెల్యే విజయశ్రీ, టీడీపీ నాయకులు

సూళ్లూరుపేట, జూన్ 28(ఆంధ్రజ్యోతి): టీడీపీలో చురుగ్గా పనిచేసే సమర్థవంతులైన నాయకులను గ్రామ కమిటీలకు ఎన్ను కోవాలని నియోజకవర్గ పరిశీలికుడు డాక్టర్ శివప్రసాద్ అన్నారు. శనివారం సూళ్లూరుపేట పట్టణంలోని సత్యసాయి కల్యాణ మండపంలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అధ్యక్షతన సంస్థాగత ఎన్నికల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ అందరూ సమన్వయంతో సమర్థవంతమైన నాయకులను ఎన్నుకుంటే గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతం అవుతుందన్నారు. వివాదాలకు తావులేకుండా సమన్వయంతో సంస్థాగత ఎన్నికలు నిర్వహించి అందరి అభిప్రాయాలతో గ్రామ, పట్టణ కమిటీలను నియమిస్తామని చెప్పారు. నెల్లూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లు రెడ్డి మాట్లాడుతూ పార్టీలో కష్టపడిన వారికి సముచిత స్థానం లభిస్తుందని, ఇందులో ఎటువంటి సందేహం వద్దన్నారు. 2029లో మళ్లీ మనం అధికారంలోకి రావాలంటే వివాదాలకు తావులేకుండా నాయకులందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. రాబోయే మున్సిపల్, జిల్లా పరిషత్ ఎన్నికల్లో టీడీపీ జెండా ఎగురవేయాలన్నారు. ఎమ్మెల్యే విజయశ్రీ మాట్లాడుతూ పార్టీలో కష్టపడిన వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం, నాయుడుపేట మండలాల పరిశీలకులు షేక్ రఫీ, నువ్వుల శివరామ కృష్ణ, పచ్చిగార్ల రత్నం, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, నాయకులు కామిరెడ్డి మురళీరెడ్డి, శ్రీనివాసులు నాయుడు, కందల కృష్ణారెడ్డి, అశోక్‌రెడ్డి, కొక్కు శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇరకంకుప్పంవాసులకు పూడికుప్పంలో ఇళ్ల స్థలాలు


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఆర్డీవో కిరణ్మయి

తడ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఇరకంకుప్పం గ్రామస్తులు పూడికుప్పంలో నివాసం ఏర్పరుచుకునేందుకు వీలుగా త్వరలోనే ఇళ్ల స్థలాలను మంజూరు చేస్తామని ఆర్డీవో కిరణ్మయి తెలిపారు. శనివారం ఇరకంకుప్పం గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. పూడికుప్పం గ్రామంలో నివాసం ఉండేందుకు ఇళ్ల పట్టాలను మంజూరు చేయాలంటూ గ్రామస్తులంతా దరఖాస్తు చేసుకోవడంతో గ్రామసభ నిర్వహిస్తున్నామని ఆర్డీవో చెప్పారు. పూడికుప్పంలో ప్రస్తుతానికి 160 మందికి ఇళ్లస్థలాలు కేటాయించేందుకు నిర్ణయించామన్నారు. దీనిపై గ్రామస్తుల అభిప్రాయాలను తెలపాలని కోరగా అందరూ సమ్మతించారు. అనంతరం మత్స్యకార మహిళలతో కొంతసేపు ఆర్డీవో ముచ్చటించారు. గ్రామసభలో తహసీల్దారు శరత్‌బాబు, ఎంపీడీవో శేఖర్ నాయక్, ఆర్డీవో కార్యాలయ ఏవో రవికుమార్, వీఆర్వో బాబు, పంచాయతీ కార్యదర్శి మస్తాన్, గ్రామపెద్దలు వాసు, గుణ, వినోద్, జయపాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను అంతదూరం పంపలేం
పాఠశాలల విలీనాన్ని అంగీకరించని తల్లిదండ్రులు


వాక్యంలో విద్యార్థుల తల్లితండ్రులతో మాట్లాడుతున్న అధికారులు


బాలాయపల్లి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని అలిమిలి పాఠశాల విద్యార్థులను మన్నూరుకు, నిండలి పంచాయతీలోని వాక్యం ప్రాథమిక పాఠశాల విద్యార్థులను కడగుంటకు తరలించేలా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని విద్యార్థుల తల్లితండ్రులు ముక్త కంఠంతో వ్యతిరేకించారు. తమ గ్రామాల్లోని పాఠశాలలను యథావిధిగా కొనసాగించాలని కోరుతూ విద్యార్థుల తల్లితండ్రులు ఇటీవల కలెక్టర్‌ను కలిసి విన్నవించారు. కలెక్టర్ ఆదేశాలతో తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీడీవో వినీల్ కుమార్, ఎంఈవో ప్రదీప్ కుమార్ శనివారం ఆయా గ్రామాల్లోని విద్యార్థుల తల్లితండ్రులను కలిసి మాట్లాడారు. ప్రభుత్వం నిర్దేశించిన పాఠశాలకు విద్యార్థుల పంపేలా ఒప్పించేందుకు ప్రయత్నించారు. విద్యార్థుల తల్లితండ్రులు మాట్లాడుతూ అలిమిలి నుంచి మన్నూరుకు నాలుగు కిలోమీటర్లు, వాక్యం నుంచి కడగుంటకు ఆరు కిలోమీటర్లు వెళ్లాలని, విద్యార్థులు అంతదూరం వెళ్లేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. తమ పిల్లలు తమ గ్రామాల్లోని పాఠశాలల్లోనే చదువుకునేలా చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు.

యువతి ఆత్మహత్య


మృతిచెందిన మహేశ్వరి

చిల్లకూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైటాసత్రం గిరిజన కాలనీలో ఓ యువతి శనివారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల వివరాల మేరకు... మండలంలోని రైటాసత్రం గిరిజన కాలనీకి చెందిన మహేశ్వరి(18) గూడూరులోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదివి ప్రస్తుతం ఇంటి వద్దే ఉంటోంది. యువతి తల్లి మృతి చెందింది. తండ్రి శివప్రసాద్ కూలి పనులు చేసి కుటుంబాన్ని పోషిస్తుంటాడు. శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో మహేశ్వరి ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతదేహాన్ని గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి


సాయినరేంద్ర (ఫైల్‌ఫొటో)

చిల్లకూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కడివేడు సమీపంలో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు... మండలంలోని కమ్మవారిపాళెం గ్రామానికి చెందిన సాయినరేంద్ర(31) గూడూరులోని ఎస్‌బీఐలో రికవరీ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం పనులు ముగించుకుని ద్విచక్ర వాహనంలో గ్రామానికి వెళుతుండగా కడివేడు సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా గంగమ్మ జాతర

గూడూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెల్లటూరు గ్రామంలో శనివారం గంగజాతర వైభవంగా నిర్వహించారు. భక్తులు గంగపెట్టెను, బోనాలను తలపై ఉంచుకుని మంగళవాయిద్యాలు, తప్పెట్లు, గొల్లల వీరతాళ్ల నడుమ గ్రామోత్సవం జరిపారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు.


బోనాలు, గంగపెట్టెను ఊరేగిస్తున్న భక్తులు

వైభవంగా అగ్నిగుండ మహోత్సవం

పెళ్లకూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెంబేడు గ్రామంలో శనివారం రాత్రి అగ్నిగుండ మహోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పాండురంగ స్వామి ఆలయాన్ని పలు రకాల పూలు, విద్యుత్ దీపాలంకరణతో సుందరంగా అలంకరించారు. ముందుగా స్వామివారికి కలశపూజ ప్రారంభించి పండరీ భజనలు, కోలాటాలు వేశారు. భజన గురవయ్యదాస్ ఆధ్వర్యంలో స్వామివారి కంకణాలు ధరించి దీక్షలో ఉన్న భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు.

విద్యాసామగ్రి పంపిణీ

గూడూరు అర్బన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక రోటరీభవన్‌లో విద్యార్థులకు విద్యాసామగ్రిని శనివారం అందజేశారు. కార్యక్రమంలో శ్రీధర్‌రెడ్డి, జీజీ నాయుడు, బొమ్మిరెడ్డి సురేంద్రరెడ్డి, డాక్టర్ రమణయ్య, రాజేంద్రకుమార్, మునిగిరీష్, డాక్టర్ జనార్దనరెడ్డి, దశరథరామిరెడ్డి, మల్లు విజయ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక అభివృద్ధికి నిధులివ్వండి

పెళ్లకూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీలపాటూరు ఎస్సీకాలనీ శ్మశానవాటికలో ఆక్రమణలను తొలగించి అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేయాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీకి టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య ఆధ్వర్యంలో జీలపాటూరు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పార్థసారథి, గ్రామస్తులు ఎస్‌వీ రాజ, బుడతోటి మురళి, చింతల ఎల్లయ్య, కత్తి గురవయ్య. చింతల రామకృష్ణ, పాల్గొన్నారు.

నిరుపయోగంగా వాటర్ ట్యాంక్



కేవీబీపురం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూరిపురం గిరిజన కాలనీ, కేవీబీపురం కొత్త కాలనీ ప్రజల తాగునీటి అవసరాల నిమిత్తం 8సంవత్సరాల క్రితం రూ.8లక్షలతో 40వేల లీటర్ల సామర్థ్యంతో వాటర్ ట్యాంక్‌ను నిర్మించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆ ట్యాంకు ప్రారంభానికి నోచుకోలేదు. ఈ రెండు కాలనీలతో పాటు ఆదర్శ పాఠశాల, కేజీబీవీ విద్యార్థులకు కూడా నీటిని సరఫరా చేసేందుకు అప్పట్లో ఈ ట్యాంకు నిర్మాణం చేపట్టారు. సంవత్సరాలు గడుస్తున్నా ఇంత వరకు ప్రారంభించకుండా నిరుపయోగంగా ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తమకు వాటర్ ట్యాంకును అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

కొత్తగుంట ఎస్సీ కాలనీలో తాగునీటి కష్టాలు


ఓవర్ హెడ్ ట్యాంక్ నుంచి నీటిని తెచ్చుకుంటున్న ఎస్సీ కాలనీవాసులు

చిట్టమూరు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చిట్టమూరులోని కొత్తగుంట ఎస్సీ కాలనీవాసులు తాగునీటికి కష్టాలు పడుతున్నారు. వాకాడు స్వర్ణముఖి నది నుంచి వచ్చే కోగిలి సీపీడబ్ల్యూఎస్ స్కీమ్ ద్వారా కొత్తగుంట ఎస్సీ కాలనీకి తాగునీటి సరఫరా జరుగుతోంది. కొందరు అక్రమంగా కుళాయిలు, వరలతో నేలబావులు ఏర్పాటు చేసుకోవడం, మోటార్ల ద్వారా నీటి తోడేస్తుండడంతో అందరికీ తాగునీరు అందడంలేదు. అలాగే కొన్నిచోట్ల పైపు లైన్ దెబ్బతినడం వల్ల తాగునీరు వృథాగా పోతోంది. అంతేకాకుండా కొందరు భవన నిర్మాణాలకు సైతం తాగునీటినే వాడుతున్నారు. దీంతో అందరికీ సరిపడా నీరు అందక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీ సమీపంలోని ఓవర్ హెడ్ ట్యాంక్ ఓవర్ ఫ్లో అయి బయటకు వచ్చే నీటిని తెచ్చుకుంటున్నారు. అధికారులు స్పందించి ఎస్సీ కాలనీలో తాగునీటి కొరత లేకుండా పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

వ్యభిచార గృహ నిర్వాహకురాలిపై కేసు

నాయుడుపేట టౌన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజగోపాలపురం ప్రాంతంలో వ్యభిచారం నిర్వహిస్తున్న ఓ ఇంటిని తనిఖీ చేసినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు. వ్యభిచార గృహ నిర్వాహకురాలితో పాటు ఓ విటుడిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

మీడియాపై దాడి గర్హనీయం: టీడీపీ

శ్రీకాళహస్తి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): హైదరాబాదులో మహా న్యూస్ కార్యాలయంపై దాడి చేసిన ఘటన గర్హనీయమని టీడీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఉమేష్‌రావు ఖండించారు. పట్టణంలోని తన కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ప్రజాస్వామ్యంలో మీడియా ఎంతో కీలకమన్నారు. ఇలాంటి దుశ్చర్యలను ప్రజాస్వామ్యవాదులందరూ ఖండించి బాధితులకు సంఘీభావంగా నిలవాలన్నారు. దాడి చేసిన వారిని శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మిన్నల్ రవి, కోట చంద్రశేఖర్, మునిరాజు యాదవ్, సునీల్, భాస్కర్, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

డిమాండ్ల సాధనకై..
- మున్సిపల్ ఇంజనీరింగ్ సిబ్బంది అర్ధనగ్న ప్రదర్శన



పుత్తూరు అర్బన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే తమకు న్యాయం జరుగుతుందని మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం ఔట్ సోర్సింగ్ సిబ్బంది అన్నారు. శనివారం తమ డిమాండ్ల సాధనకై అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలియజేశారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల కోసం ప్రత్యేకించి మంత్రి వర్గ ఉపసంఘం నియమించిందని గుర్తు చేశారు. ఇందుకు ఏపీ జేఏసీ అమరావతి పక్షాన ప్రత్యేక ధన్యవాదాలను తెలియజేశారు. గతంలో ప్రైవేటు ఏజెన్సీలతో ఔట్ సోర్సింగ్ సిబ్బంది అనేక రకాలుగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎఫ్‌ఎంఎస్ పరిధిలో కార్మికులను చేర్చడంతో సంక్షేమ పథకాలను రద్దు చేయడాన్ని ప్రశ్నించారు. వేతనాలు పెంచడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. కార్మిక సంఘ నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

పుత్తూరు అర్బన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన స్థానిక వెంకటేశ్వర ఆస్పత్రి సమీపంలోని అండర్‌బ్రిడ్జి వద్ద శనివారం చోటుచేసుకుంది. నీలిరంగుగళ్ల లుంగీ, వంగపూత రంగు చొక్కా ధరించిన ఈ వ్యక్తి నిత్యం భిక్షాటన చేసుకుంటూ అదే ప్రాంతానికి వచ్చి నిద్రించేవాడని స్థానికులు చెప్పారు. వీఆర్వో యశోద సంఘటనా స్థలానికి చేరుకుని సంబంధిత అధికారులకు సమాచారం అందజేశారు. మృతుడు గుర్తు తెలియని వ్యక్తిగా పోలీసులు కేసు నమోదు చేశారు.

వృత్తి శిక్షణతో మహిళల ఆర్థిక ప్రగతి


వృత్తి శిక్షణ కోర్సుల వస్తువులను అందిస్తున్న రాస్ నిర్వాహకులు

పుత్తూరు టౌన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): వృత్తి శిక్షణతో మహిళలు వ్యక్తిగతంగా ఆర్థిక ప్రగతి సాధించగలరని జన్ శిక్షణ్ సంస్థాన్ డైరెక్టర్ మోహన్ అన్నారు. శనివారం పుత్తూరు పట్టణంలోని రాష్ట్రీయ సేవా సమితి కార్యాలయంలో జన్ శిక్షణ్ సంస్థాన్ ఆధ్వర్యంలో టైలరింగ్, ఆర్యవర్క్‌లో శిక్షణ పొందుతున్న మహిళలకు అవసరమైన టైలరింగ్ వస్తువులను నిర్వాహకులు అందజేశారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ 80 రోజులపాటు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు ఇస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జేఎస్‌ఎస్ అధికారి హరి, రాస్ అధికారులు రవి, తేజ, మీనా, జయంతి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

ముక్కంటి సేవలో ప్రముఖులు




జస్టిస్ సుమతి దంపతులకు స్వామి అమ్మవార్ల జ్ఞాపిక అందజేస్తున్న ఏఈఓ మోహన్ - ముక్కంటి ఆలయంలో హైకోర్టు రిజిస్ట్రార్ శ్రీనివాస శివరాం

శ్రీకాళహస్తి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయాన్ని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఇందులో భాగంగా హైకోర్టు జస్టిస్ సుమతి జగడం, హైకోర్టు అడ్మినిస్ట్రేషన్, విజిలెన్స్ సంయుక్త విభాగాల రిజిస్ట్రార్ శ్రీనివాస శివరాం వేరువేరుగా కుటుంబ సమేతంగా ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు దక్షిణ గోపురం వద్ద వారికి లాంఛనంగా స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేశారు. స్వామి అమ్మ వారి దర్శనం అనంతరం మృత్యుంజయ సన్నిధిలో పండితులు వేద ఆశీర్వచనం అందజేశారు. అధికారులు స్వామి అమ్మవార్ల జ్ఞాపిక తీర్థప్రసాదాలను బహూకరించారు.

పాఠశాల విలీనం ఆపండి



ధర్నా నిర్వహిస్తున్న గ్రామస్తులు

సత్యవేడు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరడం ప్రాథమిక పాఠశాలలో 3, 4, 5 తరగతులను మదనంబేడు పాఠశాలలో విలీనం చేయడాన్ని నిరసిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులు శనివారం పాఠశాలకు ఎదురుగా సత్యవేడు - ఊత్తుకోట్టై రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లితండ్రులు మాట్లాడుతూ నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న పాఠశాలకు తమ పిల్లలు వెళ్లి రావడం ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్ణయం మార్చుకోకుంటే తమ పిల్లలకు బడి మాన్పించేయాల్సిందేనని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున రోడ్డుపై బైఠాయించడంతో సత్యవేడు - ఊత్తుకోట్టై మార్గంలో భారీగా ట్రాఫిక్ స్తంభించింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ రామస్వామి సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. ఎస్ఐ సూచనలతో గ్రామస్తులు ధర్నా విరమించారు.

రైతు ఉత్పత్తిదారుల సమాఖ్యతో మెరుగైన ఫలితాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఏవో

బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రైతు ఉత్పత్తిదారుల సమాఖ్యతో మెరుగైన ఫలితాలు సాధించవచ్చునని వెలుగు ఏపీఎం మునెయ్య తెలిపారు. మండల వెలుగు కార్యాలయంలో రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య సమావేశం శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన మండల వ్యవసాయాధికారి షణ్ముగం మాట్లాడుతూ రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య ద్వారా ఎప్పటికప్పుడు వ్యవసాయ అనుబంధ రంగాల్లో మెలకువలు, ప్రభుత్వం అందించే పథకాల గురించి తెలియజేస్తే వ్యవసాయ దారులు మెరుగైన ఫలితాలు పొందవచ్చునని తెలిపారు. రైతులు రైతు సేవా కేంద్రంలో ఈ-పంట నమోదు చేసుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయం సాగుకు రైతులను చైతన్యపరచాలన్నారు. సీసీలు వీరజిన్నప్ప, వెంకటరత్నం, సంఘాల లీడర్లు పాల్గొన్నారు.

మూడు గడ్డివాముల దగ్ధం

● రూ.5లక్షల నష్టం



కాలుతున్న గడ్డివాములు

బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్.అనంతపురం గ్రామంలో ప్రమాదవశాత్తు మూడు గడ్డివాములు దగ్ధమయ్యాయి. బాధితుల కథనం మేరకు వివరాలు.. గ్రామానికి చెందిన శారదమ్మ, మంజుల, ఈశ్వరయ్యలు చెరువుకట్ట దగ్గర 600 గడ్డి మోపులను వేసి ఉన్నారు. శనివారం మధ్యాహ్నం గడ్డివాముల నుంచి మంటలు రావడంతో పరుగునవెళ్లి అదుపు చేయడానికి ప్రయత్నం చేయగా, అదుపు కాలేదన్నారు. శ్రీకాళహస్తి ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వగా మంటలు అదుపు చేసేటప్పుడు నీరు అయిపోవడంతో షుగర్ ఫ్యాక్టరీ దగ్గర నీరు పట్టుకొచ్చే సమయానికి గడ్డివాములు పూర్తిగా కాలిపోయినట్లు బాధితులు తెలిపారు. సుమారు రూ.5 లక్షల మేర నష్టం జరిగినట్లు బాధితులు చెప్పారు. ప్రభుత్వం తమను ఆర్థికంగా ఆదుకోవాలని వారు కోరారు.

శేష వాహనంపై పరాశరేశ్వరుడు



శేష వాహనంపై చంపకవల్లి సమేత పరాశరేశ్వరస్వామి

నారాయణవనం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన నారాయణవనంలో వెలసిన టీటీడీ అనుబంధ ఆలయమైన చంపకవల్లీ సమేత పరాశరేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామి అమ్మవార్లు శేష వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నిత్యకైంకర్యాలు నిర్వహించిన అనంతరం వేద మంత్రాల నడుమ ప్రత్యేక పుష్పాలతో, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారితో సహా అమ్మవారిని ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. సాయంత్రం 7 గంటలకు చంపకవల్లీ సమేత పరాశరేశ్వరస్వామి వారిని వివిధ పుష్పాలతో అలంకరించి శేష వాహనంపై అధిరోహింపజేసి, పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు నారికేళ, కర్పూర నీరాజనాలతో దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఏఈవో రవి, ఆలయాధికారి నాగరాజు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి గ్రామోత్సవం



గ్రామోత్సవంలో శ్రీనివాసుడు

వడమాలపేట, జూన్ 28(ఆంధ్రజ్యోతి): అప్పలాయగుంటలోని ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం శ్రీవారి గ్రామోత్సవం, ఊంజల్‌సేవ వైభవంగా నిర్వహించారు. వేకువ జామున సుప్రభాతసేవతో స్వామి వారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉభయ నాంచారులతో ప్రసన్న వెంకటేశ్వర స్వామిని సర్వాభరణాలు, పూలమాలలతో ఊయలలో అలంకరించి వేదమంత్రాలు, భక్తుల గోవింద నామ స్మరణల నడుమ ఊంజల్ సేవ నిర్వహించారు. అనంతరం సర్వాలంకార భూషితుడైన పద్మావతీ ఆండాల్ సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామిని మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ మాడ వీధుల్లో ఊరేగించారు. భక్తులు నారికేళ, కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకొన్నారు. అనంతరం ఆలయానికి చేరుకొన్న స్వామి వారికి మంగళహారతులిచ్చారు. కార్యక్రమంలో ఆలయ అధికారి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

శనీశ్వర స్వామికి విశేష పూజలు



విశేషాలంకారంలో శనీశ్వర స్వామి

శ్రీకాళహస్తి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయంలో వెలసిన శనీశ్వర స్వామికి విశేష పూజలు నిర్వహించారు. శనివారం విశేషాన్ని పురస్కరించుకుని ఉదయం శనీశ్వర సన్నిధిని మంత్ర జలాలతో శుద్ధి చేశారు. అనంతరం శని దోష నివారణ, శనీశ్వర స్వామి ప్రీతి కొరకు తైలాభిషేకంతో పాటు వివిధ పూజా ద్రవ్యాలతో విశేషంగా అభిషేకాలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అభిషేక పూజలను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అర్చకులు స్వామివారిని అలంకరించి ధూప, దీప నైవేద్యాలను సమర్పించారు.

స్కూల్ బస్సుల్లో తనిఖీలు



స్కూల్ బస్సును తనిఖీ చేస్తున్న దామోదర్ నాయుడు

బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రైవేటు పాఠశాలలకు చెందిన స్కూల్ బస్సులను శ్రీకాళహస్తి మోటరు వెహికల్ ఇన్‌స్పెక్టర్ దామోదర్ నాయుడు శనివారం మండల కేంద్రంలో తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పాఠశాల యాజమాన్యం విద్యార్థులను తరలించే బస్సుల్లో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు. బస్సు డ్రైవర్లకు పలు సూచనలు చేశారు.

సరళమైన బోధనతో సత్ఫలితాలు



అట్టముక్కలతో తయారుచేసిన అక్షరాలతో బోధిస్తున్న ఉపాధ్యాయుడు బాలసుబ్రమణ్యం

శ్రీకాళహస్తి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): సరళమైన బోధనతో విద్యా వ్యవస్థలో సత్ఫలితాలు సాధించవచ్చని ప్రభుత్వ ఉపాధ్యాయుడు బాలసుబ్రమణ్యం తెలిపారు. తొట్టంబేడు మండలం దిగువ సాంబయ్యపాలెం ప్రభుత్వ పాఠశాలలో శనివారం ఆయన ఆటవిడుపుగా విద్యార్థులకు వినూత్న విధానంలో అక్షరాల బోధన చేశారు. అట్టముక్కలతో రూపొందించిన అక్షరాలను మాట్లాడే బొమ్మతో పరిచయం చేసేలా ఆకట్టుకుంటూ బోధించారు. పిల్లలు ఎంతో ఆసక్తితో ఉత్సాహంగా ఆలకించారు. కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్మన్ కల్పన, వైస్ చైర్మన్ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు - డ్రైవర్‌కు గాయాలు



ఏర్పేడు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలంలోని సీతారామపేట వద్ద నేషనల్ హైవేపై తిరుపతి నుంచి ఏర్పేడు వైపు వస్తున్న కారు వేగంగా వచ్చి అదుపు తప్పి హైవే పక్కన ఉన్న డివైడర్‌ను ఢీకొని పక్కనే ఉన్న కాలువ పైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న సీతారామపేట గ్రామానికి చెందిన డ్రైవర్ హరికృష్ణ (40) మాత్రమే గాయపడ్డారు. ఈ ఘటనపై ఎటువంటి కేసు నమోదు కాలేదు. స్థానికులు గుర్తించి డ్రైవర్‌ను తిరుపతిలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

నట్టల నివారణ మందును తాగించాలి

సత్యవేడు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పాడి పశువులు, మేకలు, గొర్రెలు అనారోగ్యం బారిన పడకుండా అంతరపరాన్న జీవుల నిర్మూలనకు పాడి రైతులు తమ జీవాలకు తప్పసరిగా నట్టల నివారణ మందులను తాగించాలని సత్యవేడు వెటర్నరి ఏడీఏ అప్సర్ సహెద్ తెలిపారు. శనివారం స్థానిక పశుసంవర్థక శాఖ ఏడీఏ కార్యాలయంలో నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి, జీవాలకు మందులను తాగించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ఈనెల 26 నుంచి జూలై 10 వరకు ఊరూరా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టి గొర్రెల పెంపకం దారుల ఇంటి వద్దకే సిబ్బంది వెళ్లి నట్టల నివారణ మందులను తాగించనున్నట్లు వెల్లడించారు. పాడి రైతులు అపోహలు మాని తమ జీవాలకు నట్టల నివారణ మందులను తాగించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, నాయకులు పరమశివం తదితరులు పాల్గొన్నారు

టీసీ ఇవ్వడం లేదని ఎస్పీకి ఫిర్యాదు

నాగలాపురం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): తన కుమార్తెను మరో పాఠశాలలో చేర్పించేందుకు టీసీ ఇవ్వాలని అడుగుతున్నా ఇవ్వడం లేదని.. న్యాయం చేయాలని కోరుతూ ఎస్పీ హర్షవర్ధన్‌రాజుకు ఓ విద్యార్థిని తల్లి వినతి పత్రం అందించింది. విద్యార్థిని తల్లి వివరాల మేరకు.. మండలంలోని కృష్ణాపురానికి చెందిన మహేష్, రుక్మిణి దంపతుల కుమార్తె మెర్లిన్ (7వ తరగతి), దుర్గాప్రసాద్ (5వ తరగతి)లు పిచ్చాటూరు మండలంలోని భారతి ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్నారు. ఆర్థిక భారంవల్ల కుమార్తె మెర్లిన్‌ను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు టీసీ ఇవ్వాలని అడిగితే పాఠశాల యాజమాన్యం ఫీజులు మొత్తం చెల్లిస్తేనే ఇస్తామని చెప్పడంతో ఫీజు చెల్లించామన్నారు. మళ్లీ తమ కుమారుడు ఫీజు పూర్తిగా చెల్లిస్తేనే కుమార్తె టీసీ ఇస్తామని, లేదంటే ఇచ్చేది లేదంటూ నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తున్నారని, న్యాయం చేయాలంటూ విద్యార్థిని తల్లి రుక్మిణి ఫిర్యాదులో పేర్కొన్నారు.

పందుల బెడదను తప్పించండి



ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎదుట పందుల గుంపు

శ్రీకాళహస్తి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి పట్టణంలో పందులు బెడదను తప్పించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇటీవల శ్రీకాళహస్తి పట్టణంలో పందుల సంతతి విపరీతంగా పెరిగిపోయింది. కొందరు జనావాసాల మధ్యలో పందులను వదిలి వీధి పశువుల తరహాలో పెంపకం సాగిస్తున్నారు. హోటళ్లు, రెస్టారెంట్ల వద్ద ఆహార వ్యర్థాలను సేకరించి రోడ్లపైన పందులకు మేతగా వేస్తున్నారు. దాంతో పందుల సంఖ్య అంతకంతకు పెరిగిపోతోంది. ఇళ్ల మధ్యలో పందుల సంచారంతో ప్రజలు ఇబ్బందికరంగా జీవనం సాగిస్తున్నారు. మురుగులో దొర్లిన పందులు నివాస ఆవరణలోకి ప్రవేశిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. రానున్న వర్షాకాలం దృష్ట్యా పందుల సంచారాన్ని నివారించకపోతే ప్రమాదకర వ్యాధులు విజృంభించే అవకాశం ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెగ్యులర్ తహసీల్దార్‌ను నియమించండి


● ధ్రువీకరణ పత్రాల కోసం ప్రజలకు ఇక్కట్లు



బోసిపోతున్న కేవీబీపురం తహసీల్దార్ కార్యాలయం

కేవీబీపురం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కేవీబీపురం మండలానికి రెగ్యులర్ తహసీల్దార్‌ను నియమించాలని ప్రజలు కోరుతున్నారు. తహసీల్దార్ లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు, రైతులు వివిధ ధ్రువీకరణ పత్రాల కోసం నానా పాట్లు పడుతున్నారు. ఇక్కడ పనిచేస్తున్న ఇన్‌చార్జ్ తహసీల్దార్ మునిరత్నం మే 30వ తేదీన పదవీ విరమణ పొందారు. ఆయన స్థానంలో తొట్టంబేడు తహసీల్దార్‌ను కొంత కాలం ఇన్‌చార్జిగా నియమించారు. ఆయన కూడా ఇక్కడకు సరిగా రాకపోవడంతో ప్రజలు తహసీల్దార్ కార్యాలయానికి రావడం లేదు. కింది స్థాయి అధికారులు కూడా సరిగ్గా కార్యాలయానికి రాకుండా బదిలీల పేరుతో కాలయాపన చేస్తున్నారు. దీంతో మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో పనులు జరగక, ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని రెగ్యులర్ తహసీల్దార్‌ను నియమించి, కార్యాలయంలో పనులు సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా 'పాండవ విద్యాభ్యాసం'

ఉదయం, రాత్రి పురవీధుల్లో ఊరేగుతున్న స్వామి అమ్మవార్లు

శ్రీకాళహస్తి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా శ్రీకాళహస్తిలో వెలసిన ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజైన శనివారం పాండవ విద్యాభ్యాసం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి అమ్మవార్లను విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్జునుడు, ద్రౌపది, శ్రీకృష్ణుడి ఉత్సవమూర్తుల నగరోత్సవం జరిగింది. ఆలయంలో జరిగిన పాండవ విద్యాభ్యాసం తిలకించడానికి భక్తులు పెద్దసంఖ్యలో వచ్చారు. రాత్రి స్వామి అమ్మవార్లు పురవీధుల్లో ఊరేగారు. భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

నేడు బకాసుర వధ

ద్రౌపదీ సమేత ధర్మరాజ స్వామి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం హిడింబాసుర, బకాసుర వధ ఘట్టం జరగనుంది. ముందుగా మధ్యాహ్నం భీముడు వేషధారి నగరోత్సవంగా ఎడ్ల బండిపై సంచరించి పట్టణ వ్యాప్తంగా భక్తుల నుంచి భోజనాలు స్వీకరించి పోగు చేస్తారు. సాయంత్రం సాంప్రదాయబద్ధంగా ధర్మరాజ స్వామి ఆలయ ప్రాంగణంలో బకాసుర వధ ఘట్టాన్ని వేషధారులు నాటకీయంగా ప్రదర్శిస్తారు. ఈ విశేష ఘట్టాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున విచ్చేస్తారు.

పంచాయతీల్లో చెత్త సేకరణ చేపట్టాలి

బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): జూలై 1నుంచి కార్యదర్శులు ప్రతి రోజు అన్ని పంచాయతీల్లో చెత్తసేకరణ కార్యక్రమం చేపట్టాలని ఎంపీడీవో వెంకటరత్నమ్మ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూమండలంలో డీపీవో పర్యటించి సంపద కేంద్రాల ద్వారా చెత్త సేకరణ చేపట్టకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారని, ప్రతి కార్యదర్శి వారి పంచాయతీలో పారిశుధ్య కార్మికుల చేత ఉదయాన్నే చెత్త సేకరణ చేపట్టాలని తెలిపారు. ప్రతి ఉదయం జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఐవీఆర్ఎస్ కాల్స్ ప్రజలకు వస్తాయని చెప్పారు. ఉపాధి హామీ ఏపీవో దేవరి, డిప్యూటీ ఎంపీడీవో రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బుగ్గవీధిలో పారిశుధ్య చర్యలు



కాల్వలను శుభ్రంచేస్తున్న పారిశుధ్య కార్మికులు

రేణిగుంట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బుగ్గ వీధిలో మురుగు కాలువలను శనివారం పంచాయతీ అధికారులు శుభ్రం చేయించారు. 'రోడ్డుపై పారుతున్న మురుగు నీరు' అనే వార్త శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురించడంతో స్పందించిన పంచాయతీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ శనివారం ఆ ప్రాంతంలోని కాలువల్లో పేరుకుపోయిన చెత్తను పారిశుధ్య కార్మికుల చేత తొలగించి, శుభ్రం చేశారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తారకరామానగర్‌లో
గంజాయి బ్యాచ్ ఆగడాలు

రేణిగుంట, జూన్ 28(ఆంధ్రజ్యోతి): తారకరామా నగర్‌లో గంజాయి బ్యాచ్ ఆగడాలు రోజురోజుకు శృతి మించుతున్నాయి. వివరాలకు వెళితే.. మండలంలోని కరకంబాడి పంచాయతీలోని తారకరామా నగర్‌లో రాత్రి అయితే ఏకంగా పోలీస్ అవుట్ పోస్ట్ పక్కనే ఉన్న రోడ్డుపై ద్విచక్ర వాహనాలలో వెళ్లే యువతులను, నడుచుకుంటూ వెళ్లే మహిళలను గంజాయి బ్యాచ్ మత్తులో అసభ్యకరంగా ప్రవర్తిస్తూ వేధిస్తున్నారు. ఈ గంజాయి బ్యాచ్ స్థానికేతరులు కావడం గమనార్హం. ప్రతి రోజు రాత్రి సమయంలో 15 మంది యువకులు తారకరామా నగర్ కేంద్రంగా చేసుకొని గంజాయి, మద్యం సేవిస్తూ మత్తులో రోడ్డుపై వీరవిహారం చేస్తున్నారు. 15 రోజుల క్రితం ద్విచక్ర వాహనంలో వెళ్తున్న ఓ వ్యక్తి వాహనం ఆపనందుకు అతడిపై దాడి చేసినట్లు సమాచారం. రాత్రి సమయంలో తారకరామా నగర్‌లో అర్బన్ పోలీసులు గస్తీ కాస్తున్నా ఇటువంటి సంఘటనలు తరచూ జరుగుతుండడంతో స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు తారకరామా నగర్‌లోని గంజాయి బ్యాచ్ ఆగడాలను అరికట్టి స్థానిక మహిళలకు రక్షణ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై అర్బన్ సీఐ జయచంద్రను వివరణ కోరగా, తారకరామా నగర్‌లో నూతనంగా పోలీస్ అవుట్ పోస్టును ప్రారంభించామని, ఇద్దరు హెడ్ కానిస్టేబుల్‌ను కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. రాత్రి సమయంలో గంజాయి బ్యాచ్‌పై నిఘా ఉంచి చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

నేడు ఆగ్నేయ గణపతి ఆలయంలో పంచనామా

శ్రీకాళహస్తి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయానికి అనుబంధంగా చతుర్మాడా వీధుల్లో వెలసిన నవ సంధి వినాయకులలోని ఆగ్నేయ గణపతి ఆలయంలో ఆదివారం పంచనామా జరుపనున్నారు. ఆలయ పునర్నిర్మాణం పురస్కరించుకొని అధికారుల సమక్షంలో ముందుగా పంచనామా నిర్వహించనున్నట్లు ఈవో బాపిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

అలరించిన గణిత అష్టావధానం

రేణిగుంట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ అవధాని అరుణ్ శివప్రసాద్ చేసిన గణిత అష్టవధానం అలరించింది. శనివారం మండలంలోని కరకంబాడి పంచాయతీ తారకరామానగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రముఖ సంఖ్యాక శాస్త్రవేత్త మహాల నోబిస్ జయంతి సందర్భంగా వేమన విజ్ఞాన కేంద్రం, జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అరుణ్ శివప్రసాద్ చేసిన గణిత అష్టావధానం విద్యార్థులను, ఉపాధ్యాయులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పద్మజ, వేమన విజ్ఞాన కేంద్రం కార్యదర్శి నాగార్జున, జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి రెడ్డప్ప, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాలరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా ఊంజల్‌సేవ

నారాయణవనం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): నారాయణవనంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకన్న ఊంజల్‌సేవను వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి, నిత్యకైంకర్యాలు నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత స్వామివార్ల ఉత్సవర్లను ప్రత్యేక పుష్పాలతో అలంకరించి, పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు శ్రీధర్ భట్టాచార్య స్వామి అమ్మవార్ల ఊంజల్‌సేవను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయాధికారి నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.